# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
31-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 129

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

2లో

## ఎస్సీ నిరుద్యోగులకు వాహనాలు




- కార్పొరేషన్ ద్వారా ఎలక్ట్రిక్ వెహికిల్స్ పంపిణీ
- 90 శాతం సబ్సిడీతో ద్విచక్ర వాహనాలు
- 70 శాతం సబ్సిడీతో త్రీ వీలర్ వాహనాలు
- రాష్ట్ర వ్యాప్తంగా 7500 వెహికిల్స్ పంపిణీకి నిర్ణయం
- రూ.125.40 కోట్లు మంజూరు చేసిన సర్కారు
- ఆగస్టు 15 వరకు ప్రక్రియ పూర్తి చేయడమే లక్ష్యం

తెలంగాణ రాష్ట్రంలో పేద వర్గాల్లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనేక పథకాలు చేపడుతున్న సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. తాజాగా మరో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాలు పంపిణీ చేయనుంది. 90 శాతం దాకా సబ్సిడీతో ఈ వాహనాలను పంపిణీ

- మిగతా 2వ పేజీలో

### తెలంగాణ క్యాబినెట్ విస్తరణ

# లేనట్టే!

#### తేల్చి చెప్పిన కాంగ్రెస్ హై కమాండ్

#### ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో జరగని చర్చ

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ క్యాబినెట్ విస్తరణ ఉంటుందా? ఉంటే ఎప్పుడు ఉంటుంది?? ఎప్పుడు చేపడతారు? ఎందుకు జాప్యం జరుగుతోంది? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే ఆసక్తికర చర్చ నడుస్తోంది. విస్తరణ చేపట్టి అనవసరంగా పార్టీలో వివాదం తేవడం ఎందుకని ఆలోచిస్తున్నారా? లేకుంటే చివరి ఏడాది విస్తరణ చేపడతారా?

2లో



## ఒంగోలుపై కూటమి గురి!

#### మేయర్ పీఠాన్ని దక్కించుకునేందుకు వ్యూహం

#### మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అభ్యర్థిత్వంపై మొగ్గు


#### గెలుపు బాధ్యతలు మాజీ మంత్రి బాలినేనికి

## నల్గొండ కాంగ్రెస్‌లో

# వర్గ పోరు!

ఉమ్మడి నల్గొండ కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రేగింది. ఆధిపత్య పోరు తీవ్రమవుతోంది. కోమటిరెడ్డి వర్గానికి, ఇతర నేతలకు మధ్య విభేదాలు ముదరడంతో పరిస్థితి మారుతోంది. ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి మార్పు అనివార్యంగా తెలుస్తోంది. అదే జరిగితే సీఎం రేవంత్ రెడ్డికి షాక్ తగిలినట్టే. ఎందుకంటే నల్గొండ డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాస్ రేవంత్ వర్గానికి చెందిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. పైగా కోమటిరెడ్డి బ్రదర్స్ వ్యతిరేకిగా ఆయనకు ముద్ర ఉంది.

- మిగతా 2వ పేజీలో




- డిసిసి అధ్యక్షుడి మార్పు
- పై చేయి సాధించేందుకు కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రయత్నం
- అడ్డుకునే ప్రయత్నంలో వ్యతిరేకవర్గం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** ఇద్దరు డిసిసి అధ్యక్షులు మార్పు.. తెలంగాణ కాంగ్రెస్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మార్పు అనివార్యం అని తెలుస్తోంది. ప్రధానంగా ఇద్దరు డిసిసి అధ్యక్షులను తప్పిస్తారని ప్రచారం ఉంది. ప్రధానంగా నల్గొండ డిసిసి అధ్యక్షుడు పున్నా కైలాస్ మార్పు ఉంటుందన్న ప్రచారం గందరగోళానికి దారితీస్తోంది. అయితే కైలాష్ ను కోమటిరెడ్డి బ్రదర్స్ మొదటి నుంచి

- మిగతా 2వ పేజీలో



## ఇడ్లీ బండి వారిపై ప్రతాపం!

#### హైదరాబాదులో పోలీసుల తీరుపై విమర్శలు

#### ఇలా అయితే నైట్ ఎకానమీ ఎలా సాధ్యం

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలో రాత్రిపూట ఇడ్లీ బండి నడుపుతున్నారని ఆరోపణలతో ఒక చిన్న వ్యాపారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. న్యాయస్థానంలో హాజరు పరిచి రెండు రోజులు

- మిగతా 2వ పేజీలో



#### స్టాలిన్ కు పన్నీరు సెల్వం

# షాక్!

#### డీఎంకేకు గుడ్ బై చెప్పనున్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి

#### కుమారుడితో కలిసి విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీలోకి..

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర వార్త ఒకటి హల్చల్ చేస్తోంది. సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీలో మాజీ సీఎం, సీనియర్ నేత ఓ పన్నీరు సెల్వం, ఆయన కుమారుడు గ రవీంద్రనాథ్ చేరుతారన్న ప్రచారం బలంగా వినిపిస్తోంది.





## ఎట్టకేలకు ఆ ఇద్దరు!

#### గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దేవినేని ఉమా, వంగవీటి రాధాకృష్ణ

#### చంద్రబాబు, లోకేష్ గ్రీన్ సిగ్నల్

ఏపీలో ఎమ్మెల్సీ పదవులను ఖరారు చేసారా? చంద్రబాబు ఒక నిర్ణయానికి వచ్చారా? లోకేష్ సైతం ఆమోదముద్ర వేశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గవర్నర్ కోట కింద నియమితులైన ఇద్దరు ఎమ్మెల్సీలు ఈనెల 28న పదవీ విరమణ చేశారు.

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వారి స్థానంలో కొత్త వారి ఎంపిక కోసం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. అయితే ఆ రెండు పదవులు కూటమికే దక్కనున్నాయి. దీంతో ఆశావాహులు

- మిగతా 3వ పేజీలో



#### వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

# భారతి రెడ్డి!

### జగన్ సంచలన నిర్ణయం

#### పార్టీలో ప్రత్యామ్నాయ నాయకత్వం సిద్ధం

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. పార్టీలో జగన్ తరువాత ఎవరు అనే దానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ క్రమంలో ఆయన భార్య భారతి రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. త్వరలో ఆమెకు పార్టీలో కీలక పదవి దక్కబోతున్నట్లు

# ఇడ్లీ బండి వారిపై ప్రతాపం!

జైలు శిక్ష పడేలా చేయడం ఇప్పుడు వివాదాస్పదం అవుతోంది. వీధి వ్యాపారం చేసుకుంటూ నిజాయితీగా కష్టపడి జీవించే సామాన్యులను.. క్రిమినల్ నేరస్తుల్లా చూడడం.. వారిపై కేసులు పెట్టి వేధించడం పై ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. పోలీస్ శాఖ తీరును తప్పు పడుతున్నాయి. మల్కాజ్గిరి పోలీసుల వైఖరి పై ఇప్పుడు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**మల్కాజిగిరి పోలీసుల అతి..**

హైదరాబాద్ వంటి మహా నగరాల్లో రాత్రిపూట చాలామంది వ్యాపారాలు చేస్తుంటారు. ఐటీ రంగంతో పాటు అన్ని రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుంటారు. అటువంటి వారికి ఆహారం అందించే వారిపై నిబంధనల పేరుతో హింసించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే అయితే దీనిని గొప్పగా భావించిన మల్కాజిగిరి పోలీసులు తమ అధికారిక సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ తరువాత విమర్శలు రావడంతో దానిని డిలీట్ చేశారు. కానీ అప్పటికే అది వైరల్ అయింది. ఒకవైపు హైదరాబాదును 24 గంటల పాటు నడిచే గ్లోబల్ సిటీగా, నైట్ ఎకనామి కి నిలయంగా మారుస్తామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. కానీ ఇప్పుడు అదే నైట్ ఎకనామి కి వెన్నెముకగా ఉండే చిన్న వ్యాపారులను వేధించడం.. ఆ ఆశయాలకు గొడ్డలి పెట్టిన మారిందన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

**వేలాదిమందికి తక్కువ ధరకు భోజనం..**

హైదరాబాదులో వేలాదిమంది ఐటి, మల్టీ నేషనల్ కంపెనీల ఉద్యోగులు నైట్ షిఫ్ట్ లో పనిచేస్తుంటారు. వారికి అతి తక్కువ ధరలో ఆహారం అందించే చిన్న వ్యాపారులను క్రిమినల్స్ గా చిత్రీకరించడం తీవ్ర అన్యాయమని నేటిజెన్లు మండిపడుతున్నారు.. పెద్ద కార్పొరేట్ సంస్థలకు 24 గంటల నిర్వహణకు అనుమతులు ఇస్తూ.. వారికి సేవలు అందించే ఇడ్లీ, టిఫిన్ బండ్ల వ్యాపారులను మాత్రం జైలుకు పంపడం ఎంత మాత్రం సహేతుకం కాదు అని.. ఇది అభివృద్ధిని అణచివేయడమే అవుతోంది అన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. హైదరాబాద్ కు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈ టిఫిన్ బండ్ల వ్యాపారాన్ని నమ్ముకుంటూ వస్తున్నారు. అటువంటి వారి పొట్ట కొట్టడం తగదు అనే అభిప్రాయం వినిపిస్తోంది.

## నల్గొండ కాంగ్రెస్‌లో
# వర్గ పోరు!

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకిస్తున్నారు. మొన్న రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సమయంలో కూడా కైలాష్ కు ఆహ్వానం లేదు. కానీ రేవంత్ రెడ్డి మద్దతు ఆయనకే అన్నట్లు ప్రచారంలో ఉంది. కైలాస్ నియామకం వెనుక రేవంత్ ఉన్నారనే ప్రచారం అప్పట్లో నడిచింది. కోమటిరెడ్డి బ్రదర్స్ అప్పట్లో వ్యతిరేకించారు కూడా. అయినా సరే రేవంత్ మద్దతుతో డిసిసి అధ్యక్ష పదవి దక్కించుకున్నారు. ఇప్పుడు అదే నేతకు పదవి నుంచి తొలగిస్తే మాత్రం కోమటిరెడ్డి బ్రదర్స్ పై చేయి సాధించినట్టే అవుతుంది.

**విభేదాలు పెరిగే అవకాశం..**

పూన్నా కైలాష్ బీసీ వర్గానికి చెందినవారు. ఆయనను తొలగిస్తే మాత్రం ఉమ్మడి నల్గొండ జిల్లాలో మాత్రం ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది. ఇప్పటికే కోమటిరెడ్డి బ్రదర్స్ ను మిగతా సామాజిక వర్గ ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారు. మొన్ననే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు బహిరంగ వ్యాఖ్యలు చేశారు. ఇతర నియోజకవర్గాల్లో కోమటిరెడ్డి బ్రదర్స్ పెత్తనం ఏంటి అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో బిసి వర్గానికి చెందిన డిసిసి అధ్యక్షుడిని తొలగిస్తే పార్టీలో విభేదాలు బయటపడే అవకాశం ఉంది. అయితే నల్గొండ కాంగ్రెస్ పార్టీలో పెత్తనం కోసం కోమటిరెడ్డి బ్రదర్స్ ప్రయత్నిస్తున్నారు. దానిని వారి వ్యతిరేకవర్గం అడ్డుకుంటుంది. ఇప్పుడు డిసిసి అధ్యక్షుడి మార్పు విషయంలో ఎవరు పై చేయి సాధిస్తారో చూడాలి.

## బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూశారు. గుండె పోటు రావడంతో ఆస్పత్రితో చేరిన ఆయన చికిత్స పొందుతూ ఇవాళ తుదిశ్వాస విడిచారు. గత ఐదు రోజులుగా సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇవాళ అర్ధరాత్రి 12 గంటల 51 నిమిషాలకు మరణించారు. దీంతో బీఆర్ఎస్ శ్రేణులు విషాదంలో మునిగిపోయాయి. కాగా.. పెద్ది సుదర్శన్ రెడ్డి బీఆర్ఎస్ హయాంలో నర్సంపేట్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రధానంగా తెలంగాణ ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారు.ాశీశ్రీఔఅఎం

## స్టాలిన్ కు పన్నీరు సెల్వం షాక్!



గత ఎన్నికలకు ముందు డీఎంకే గూటికి చేరారు ఆయన. అయితే ఆ పార్టీలో చేరి ఆరు నెలలు గడుస్తోంది. అయినా సరే తనతో పాటు తన కుమారుడు కు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆయన ఆవేదనతో ఉన్నట్లు సమాచారం. డీఎంకే అధినేత పై ఆగ్రహంగా ఉన్న పన్నీరు సెల్వం విజయ్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. డీఎంకే లో తమకు సరైన రాజకీయ భవిష్యత్తు కనిపించడం లేదని భావిస్తున్న ఈ తండ్రి కొడుకులు.. త్వరలో డీఎంకేకు గుడ్ బై చెప్పడం ఖాయమన్న ప్రచారం తమిళనాడు పొలిటికల్ సర్కిల్స్ లో బలంగా వినిపిస్తోంది.

**ఎన్నికలకు ముందు చేరిక..**

సరిగ్గా ఎన్నికలకు ఆరు నెలల ముందు అన్నా డిఎంకె నుంచి డీఎంకే లో చేరారు పన్నీరు సెల్వం. తన సొంత నియోజకవర్గం తేని నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్యేగా గెలిచిన ఆ నియోజకవర్గంలో డీఎంకే ఎంపీ తంగా తమిళ్ సెల్వన్ హవా నడుస్తోంది. ఒక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిగా తనకు తగిన ప్రాధాన్యం లేకుండా పోతుందని పన్నీరు సెల్వం ఆవేదనతో ఉన్నారు. పార్టీ హై కమాండ్ సైతం ఎంపీకి ప్రాధాన్యం ఇస్తుండడంతో తీవ్ర నిరాశతో ఉన్నట్లు తెలుస్తోంది. డీఎంకే లో కొనసాగితే భవిష్యత్తులో ప్రాధాన్యం ఉండదని గ్రహించి.. టీవీకే లో చేరేందుకు సిద్ధపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

**జోరుగా ప్రచారం..**

ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత పన్నీరు సెల్వంతో పాటు ఆయన కుమారుడు పార్టీకి గుడ్ బై చెబుతారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. అయితే పన్నీర్ సెల్వం ఈ ప్రచారాన్ని ఖండించారు. డీఎంకే ను వీడి విజయ్ పార్టీలో చేరుతున్నామని సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారాలను ఖండించారు. అవి కేవలం పుకార్లు మాత్రమేనని కొట్టిపారేశారు. రాజకీయ నాయకులు పార్టీలు మారుతున్నారని జరిగే ప్రచారాలు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తాయని.. తమను నమ్ముకున్న ప్రజల విశ్వాసాన్ని ద్రోహం చేయలేమని ఆయన బహిరంగ వ్యాఖ్యలు చేశారు. కానీ ఇంతవరకు ప్రచారాలు మాత్రం ఆగడం లేదు. అయితే ఇప్పుడు కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం పన్నీరు సెల్వం టీవీకే లో చేరేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తమిళ మీడియా వర్గాలు చెబుతున్నాయి. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ఒంగోలుపై కూటమి గురి!



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ప్రకాశం జిల్లా పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది కూటమి ప్రభుత్వం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి అండగా నిలుస్తూ వస్తోంది ఆ జిల్లా. అయితే ఆ జిల్లాలో వైసిపి పూర్వ వైభవం కోసం ప్రయత్నం చేస్తోంది. దానికి ఎంత మాత్రం అవకాశం ఇవ్వకూడదు అని భావిస్తోంది కూటమి. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి జనసేనలో చేరారు. పేరు మోసిన నేతలంతా వైసీపీ నుంచి బయటకు వెళ్లిపోయారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఒంగోలు నగరపాలక సంస్థను కైవసం చేసుకోవాలని చూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఒంగోలు మేయర్ పీఠం సాధించి ప్రకాశం జిల్లాలో పూర్వ వైభవం దిశగా అడుగులు వేయాలని భావిస్తోంది. దీనిని గమనించిన కూటమి మాస్టర్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది.

**ముందుగా మున్సిపల్ ఎన్నికలు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ముందుగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ఒంగోలు కార్పొరేషన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని భావిస్తోంది. ప్రధానంగా మాజీ మంత్రి సిద్ధ రాఘవరావు కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చి.. మేయర్ పీఠం అప్పగించాలని చూస్తోంది. ఆయన అయితే ఆర్థిక బలంతో పాటు అంగ బలం ఉందని గుర్తించింది. ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీలో ఉన్న సిద్ధ రాఘవరావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. టిడిపిలో చేరేందుకు చాలా రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఆయనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**బాలినేనికి ప్రత్యేక బాధ్యతలు..**

అయితే ఒంగోలు మేయర్ పీఠంపై దృష్టి పెట్టారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ రెడ్డి. ప్రస్తుతం ఆయన జనసేన లో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు నుంచి తన కుమారుడిని రంగంలోకి దించాలని చూస్తున్నారు. అయితే అక్కడ టిడిపికి సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు. ఈ తరుణంలో అక్కడ అవకాశం లేకుండా పోయింది. త్వరలో నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. కొత్తగా ఏర్పడబోయే నియోజకవర్గ నుంచి తన కుమారుడిని కూటమి తరుపున రంగంలోకి దించే అవకాశం ఉంది. అయితే ఒంగోలు కార్పొరేషన్ పీఠాన్ని కైవసం చేసుకోవాలని సీఎం చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ టాస్క్ ఇచ్చినట్లు సమాచారం. అందుకే మాజీ మంత్రి సిద్ధ రాఘవరావును టిడిపి మేయర్ అభ్యర్థిగా పెట్టి గెలిపించుకునే బాధ్యతను బాలినేని తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తానికైతే ఒంగోలు మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు భారీ మాస్టర్ ప్లాన్ తో ఉంది కూటమి. మరి ఆ ప్రయత్నాలు ఎంత వరకు వర్క్ అవుట్ అవుతాయో చూడాలి.

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణ
# లేనట్టే!



అన్నది తెలియాల్సి ఉంది..

అగ్ర నేతల సమావేశం.. తాజాగా ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలతో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షుడు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం ఏర్పాటుతున్న క్రమంలో పాలనా తీరు, ఆరోగ్యానికి పురోగతి, పార్టీ, ప్రభుత్వ మధ్య సమన్వయం పై సమగ్రంగా చర్చించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇచ్చిన హామీలను వేగవంతంగా చేరువ చేయడమే కాకుండా.. గ్రేటర్ ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సమాయత్వం కావాలని హై కమాండ్ స్పష్టమైన మార్గదర్శకాలను అందించింది.

**విస్తరణ పై ప్రచారం జరిగినా..**

అయితే మంత్రివర్గ విస్తరణ పై ఎటువంటి చర్చ జరగలేదు. గత కొంతకాలంగా మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగింది. అదిగో విస్తరణ.. ఇదిగో విస్తరణ అంటూ కాలయాపన జరుగుతూ వచ్చింది. అసెంబ్లీ ఎన్నికలు అని ఒకసారి.. కేరళలో ప్రమాణ స్వీకారం జరిగిన తర్వాత అని మరోసారి.. ఇలా జాప్యం జరుగుతుందే తప్ప విస్తరణ జరగడం లేదు. అదిగో ఆ మంత్రిని తీసేస్తున్నారు.. ఇదిగో కొత్తవారికి అవకాశం ఇస్తున్నారు అంటూ హడావిడి తప్ప ఎటువంటి కార్యచరణ లేదు. తాజా సమావేశంలో కేవలం నామినేటెడ్ పోస్టుల విషయమై చర్చించారే తప్ప.. మంత్రివర్గ విస్తరణ విషయంలో మాత్రం ఎలాంటి సానుకూల సంకేతాలు ఇవ్వలేదు. ఉన్నత స్థాయిలో జరిగిన ఈ చర్చలో ప్రధానంగా ఆరు గ్యారెంటీలు, రైతుల రుణమాఫీ అమలు తీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోని అర్హులందరికీ అందుతున్నాయా? లేదా అనే అంశంపై సమాచారం సేకరించింది అధిష్టానం.. లోపాలు ఉంటే తక్షణం సరిదిద్దాలని ఆదేశించింది. ముఖ్యంగా ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల పంపిణీ తో పాటు రైతులకు అందించిన పథకాల అమలును ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని సూచించింది. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలకు వివరించడంలో సమాచార లోపం ఉండకూడదని.. క్షేత్రస్థాయిలో పర్యటనలను పెంచాలని మంత్రులకు, ఎమ్మెల్యేలకు స్పష్టం చేసింది. ప్రతిపక్షాలైన భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు చేసే రాజకీయ దాడిని తిప్పి కొట్టాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు. మరోవైపు నామినేటెడ్ పదవులు సైతం భర్తీ చేయాలని నిర్ణయించారు. కానీ కీలకమైన మంత్రివర్గ విస్తరణ పై మాత్రం ఎటువంటి చర్చ జరగలేదు.

# ఎస్సీ నిరుద్యోగులకు వాహనాలు

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్న సర్కారు.. మిగిలిన 10 శాతాన్ని సైతం రుణం రూపంలో చెల్లించేందుకు లబ్ధిదారుకు అవకాశం కల్పించనుంది. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాష్ట్రంలోని ఎస్సీ సామాజికవర్గాలకు అనేక పథకాలకు సహాయం అందజేస్తున్న రేవంత్ రెడ్డి సర్కారు.. తాజాగా 90 శాతం సబ్సిడీతో టూ వీలర్, 70శాతం సబ్సిడీతో త్రీ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలను పంపిణీ చేయబోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా 7,500 వాహనాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తుల నుంచి లబ్ధిదారుల ఎంపిక దాకా ఈ ప్రక్రియను ఆగస్టు 15వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఈ వాహనాలను పంపిణీ చేసేందుకు రూ.125.40 కోట్లు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 90 శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, మిగతా 10శాతం మొత్తాన్ని లబ్ధిదారుకు బ్యాంక్ రుణం మంజూరు చేస్తుంది. 2025-26 ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఈ వాహనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించగా.. అప్లికేషన్లు స్వీకరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఎస్సీ కార్పొరేషన్ ఎండీ లేఖ రాసింది. అయితే, వీటికిగాను లక్షల మందికిపైగా ఎస్సీ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. తాజాగా ఈ పథకానికి సంబంధించి అర్హతలు, మార్గదర్శకాలను అధికారులు విడుదల చేశారు.

**రెండు రకాల వాహనాలు..**

లబ్ధిదారులకు రెండు రకాల వాహనాలను అందించనున్నారు. ఎవరు దేనికి దరఖాస్తు చేసుకున్నా.. వారి అర్హతను బట్టి అధికారులు నిర్ణయం తీసుకోనున్నారు. ఇందులో భాగంగా 5,016 టూ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలను అందించనున్నారు. వీటి విలువ ఒక్కో వాహనానికి రూ.లక్ష ఉండనుంది. మరోవైపు 2,508 త్రీ వీలర్స్ వాహనాలను పంపిణీ చేయనున్నారు. ఈ వామనాల ధర ఒక్కో వాహనానికి రూ.3లక్షలు ఉండనుంది. గూడ్స్, ఫ్యాసింజర్స్ ట్రాన్స్‌పోర్టు వాహనాల రూపంలో వీటిని అందజేయనున్నారు. ఈ మేరకు పథకం యాక్షన్ ప్లాన్‌లో ఎస్సీ కార్పొరేషన్ అన్ని వివరాలను పొందుపరిచింది. కాగా, రూ.లక్షలోపు విలువ ఉన్న టూ వీలర్‌కు 90శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, 10శాతం బ్యాంక్ రుణం లభించనుంది. ఇక రూ.4లక్షలలోపు ఉన్న త్రీ వీలర్‌కు 70శాతం సబ్సిడీ ఇవ్వనుండగా, 30శాతం మొత్తాన్ని బ్యాంక్ రుణం ఇవ్వనున్నారు. దీంతో లబ్ధిదారులు కేవలం, టూ వీలర్ కు 10 శాతం, త్రీ వీలర్ కు 30 శాతం మొత్తాన్ని మాత్రమే తిరిగి చెల్లించాల్సి ఉంది. అది కూడా బ్యాంకు రుణం ఇస్తున్నందున వాయిదాల పద్ధతిలో చెల్లించుకునే వెలుసుబాటు ఉండనుంది.

**మరో రాజీవ్ యువ వికాసం కాకుండా..**

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన నిరుద్యోగులకు వాహనాలు పంపిణీ చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే.. ఈ పథకమైనా సజావుగా సాగుతుందా.. అన్న సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తలో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఇప్పటికీ అతీ గతీ లేకుండా పోయింది. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా చేపట్టిన యువ వికాసం పథకానికి నిరుద్యోగుల నుంచి కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. దీంతో అంతమందికి ఆర్థిక సాయం చేయడం సాధ్యం కాదన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. చివరికి యువ వికాసం పథకాన్నే పక్కన పెట్టేసింది. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల పంపిణీ పథకాన్నైనా దరఖాస్తులకే పరిమితం కాకుండా.. అమలు చేస్తుందా? లేదా? అన్న అనుమానాలు వ్యకమవుతున్నాయి.

## అగస్టు 9 నుంచి సైదాబాద్ లో బోనాలు

**హైదరాబాద్:** భాగ్యనగరం ప్రజలు ఆరాధ్యదై వంగా పూజించే మహంకాళి అమ్మవారి ఉత్స వాలు సైదాబాద్ ప్రాంతంలో ఆగస్ట్ 9న (ఆదివారం) ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు బ్రోచర్ ఆవిష్కరించారు శ్రద్ధా బాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 48సంవత్సరాల నుంచి మహంకాళి జాతర జరు పుతూ ఈ సంవత్సరం కూడా వేడుకలు ఘనంగా జరిపేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల పాటు నిర్వహించే సైదాబాద్ బోనాల జాతరకు ఓ ప్రత్యేకత ఉన్నది. 10న మధ్యాహ్నం 1-30 గంటల నుంచి అమ్మవారి. ఘటం ఊరేగింపు,పోతురాజు లా గావు పెట్టి,పలహారబండ్ల ఊరేగింపు,11న మధ్యాహ్నం జరిగే అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి. అమ్మవారి ఘట్టాల ఊరేగింపులో పౌరాణిక వేషాలు ధరించి భక్తి భజన పాటలతో కనువిందు చేసే ఆర్కెస్ట్రా,పోతురాజుల వేషాలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. దేశభక్తిని పెంపొందించే భగత్ సింగ్, మహాత్మాగాంధీ,అల్లూరి సీతారామరాజు,శివాజీ, రాణాప్రతాప్ వంటి దేశ భక్తుల వేషధారణలతో జాతీయ సమైఖ్య తను చాటిచెప్పేలా ప్రదర్శనలు ఇప్పిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ తెలిపారు.

# ఎట్టకేలకు ఆ ఇద్దరు!



(మొదటి పేజీ తరువాయి)

ఎక్కువగా ఉన్నారు. ఈ రెండు స్థానాలు టిడిపికే అన్నట్టు ఒప్పందం కుదరడంతో ఆ పార్టీలో ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. సీనియర్లతో పాటు జూనియర్లు సైతం ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పార్టీ అధినేత చంద్రబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ కోట కింద ఎమ్మెల్సీలుగా మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ పేర్లను ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతోంది. సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకుని ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

**సీనియర్ నేత..**

దేవినేని ఉమామహేశ్వరరావు సీనియర్ మోస్ట్ లీడర్. సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చారు. తన సోదరుడు అకాల మరణంతో నందిగామ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో గెలిచారు దేవినేని ఉమామహేశ్వరరావు. 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో గెలిచారు, 2019లో మాత్రం ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం రాలేదు. రెండుసార్లు నందిగామ నియోజకవర్గం నుంచి.. రెండుసార్లు పెనమలూరు నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మొన్నటి ఎన్నికల్లో వైసీపీ నుంచి వచ్చిన వసంత కృష్ణ ప్రసాద్ కోసం తన సీటు త్యాగం చేశారు. కూటమి వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు రాజ్యసభతో పాటు ఎమ్మెల్సీ పదవులను భర్తీ చేశారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులను సైతం ప్రకటించారు. కానీ ఇంతవరకు దేవినేని ఉమామహేశ్వరరావుకు చాన్స్ దక్కలేదు.. ఇప్పుడు మాత్రం ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

**వంగవీటి వారసుడు..**

అటు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణకుసైతం ఎమ్మెల్సీగా ఛాన్స్ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఆయన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతున్నారు. సరైన పదవి కోసం ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ఆయన 2004లో తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించడంతో ఆ పార్టీలో చేరి 2014లో పోటీ చేశారు. కానీ ఓడిపోయారు. 2019లో మాత్రం తాను అనుకున్న సీటు ఇవ్వకపోవడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని విభేదించి టిడిపిలోకి వచ్చారు. ఆ పార్టీకి మద్దతుగా ప్రచారం చేశారు. కానీ ఓడిపోయింది టిడిపి. అయినా సరే అదే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ఐదేళ్లపాటు అదే పార్టీలో కొనసాగి 2024 ఎన్నికల్లో సైతం కూటమికి మద్దతుగా ప్రచారం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో తప్పకుండా ఆయనకు పదవి దక్కుతుందని అంతా భావించారు. ఎట్టకేలకు గవర్నర్ కోట కింద భర్తీ చేస్తున్న ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తారని బయట ప్రచారం జరుగుతోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నేత మిరియాల ప్రీతమ్...

**ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొనాలి....**

**మిరియాల ప్రీతమ్...**

**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** చందానగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న తెలంగాణ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ – ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ బుధవారం పరిశీలించారు. డివిజన్‌లోని వివిధ బూత్‌ల వద్దకు వెళ్లి బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు, వివరాల సవరణ ప్రక్రియను ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఓటర్లతో మాట్లాడి సూచనలు చేశారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సరిచూసుకుని, పేరు చేరిక, చిరునామా మార్పు, తొలగింపు వంటి అవసరమైన సవరణలు చేసుకోవాలని మిరియాల ప్రీతమ్ కోరారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, ప్రతి అర్హ పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణలో ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గడువు తక్కువగా ఉన్నందున ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే తమ వివరాలను ధృవీకరించుకోవాలని సూచించారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు కీలకం...



**యూ-డైస్ ప్లస్ నమోదును పగడ్బందీగా పూర్తి చేయాలి**

**జిల్లావ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులు**

**గుండాలలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యం**

(మొదటి పేజీ తరువాయి)

**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 30 (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒక్క విద్యార్థి వివరమూ మిస్ కాకుండా యూ-డైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీహరి అయ్యం అధికారులను ఆదేశించారు. గుండాల మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఈఆర్సీ)లో నిర్వహిస్తున్న ప్రత్యేక యూ-డైస్ ప్లస్ క్యాంపును ఆకస్మికంగా సందర్శించి నమోదు ప్రక్రియను పరిశీలించారు. జిల్లాలోని 17 మండలాల్లో ప్రత్యేక క్యాంపుల ద్వారా 884 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు 1.15 లక్షల మంది విద్యార్థుల వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నమోదు, డ్రాప్‌బాక్స్ క్లియరెన్స్, అపార్ ( ఏపీఏఆర్ ) నమోదు వంటి ప్రక్రియలను సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల సమన్వయంతో వేగంగా పూర్తి చేయాలని సూచించారు.ఆధార్ నమోదు, మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ , మార్పులు--చేర్పుల కోసం విరించి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి మండలానికి ప్రత్యేక కోఆర్డినేటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొంటూ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మన్నె అగ్గి రాములు, ఆధార్ జిల్లా కోఆర్డినేటర్ రూపాని మహేష్, సీఆర్‌పీ దేవనబోయిన లింగయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ దేవనబోయిన నరేష్, కంప్యూటర్ ఆపరేటర్లు, కేజీబీవీ, మోడల్ స్కూల్, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బోనాల మహోత్సవాలకు సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డికి ఆహ్వానం

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ఉమ్మడి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఆగస్టు 2న నిర్వహించనున్న ఆషాఢ మాస బోనాల మహోత్సవాలకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన గొప్ప ఆధ్యాత్మిక ఉత్సవమని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బోనాల మహోత్సవాలకు తప్పకుండా హాజరై ఉత్సవాల విజయవంతానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మైలార్ దేవ్‌పల్లి డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రాఘవేంద్ర యాదవ్, మైసిరెడ్డి క్రాంతి, మహేందర్, శాంతిరాజ్, అఖిల్, నిఖిల్, నితిన్, చిరు, పవన్, అనిల్, చిన్న, కున్ని, సోను, యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## సర్ ప్రక్రియలో డోర్ టు డోర్ కార్యక్రమం



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేఎల్ఆర్ ఆదేశాల మేరకు, సర్ ప్రక్రియలో భాగంగా నాదరుల్ డివిజన్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బిఎల్వో లతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న మహేశ్వరం అసెంబ్లీ యాత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, 57వ నాదర్ గుల్ డివిజన్ పొలిటికల్ కోఆర్డినేటర్ అంకంగారి వెంకటేష్ గౌడ్. ఇప్పటి వరకు సర్ ఫారాలు తీసుకోనివారికి వారి ఫారాలు అందజేశారు.



## వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారతి రెడ్డి!

ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం జగన్ తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని తానై వ్యవహరిస్తున్నారు. మధ్యలో వైవి సుబ్బారెడ్డి సైతం క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారు. ఏదో తెలియని లోటు కనిపిస్తోంది. ముఖ్యంగా కుటుంబ సభ్యుల పాత్ర లేకపోవడం లోటు. అందుకే భారతి రెడ్డికి పార్టీలో కీలక పోస్టుకు ఎంపిక చేసినట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఆమెను నియమిస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది.

**ఇప్పటివరకు తెర వెనుక..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెరవెనుక సేవలు అందిస్తున్నారు భారతీ రెడ్డి. ప్రస్తుతం ఆమె సాక్షి మీడియా వ్యవహారాలను సైతం చూస్తున్నారు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చిన చాలామంది నాయకులు బయటకు వెళ్లిపోయారు. అటువంటి వారిలో విజయసాయిరెడ్డి ఒకరు. జగన్మోహన్ రెడ్డి కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచారు. 16 నెలల పాటు ఆయనతో పాటు జైలు జీవితం గడిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటులో కూడా క్రియాశీలక పాత్ర పోషించారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశారు. కానీ మొన్నటి ఎన్నికల్లో ఓటమితో పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు.

**గతంలో తల్లితో పాటు చెల్లెలు..**

గతంలో జగన్మోహన్ రెడ్డి తల్లి విజయమ్మతో పాటు చెల్లెలు షర్మిల పార్టీలోనే ఉండేవారు. ఆపై విజయసాయిరెడ్డి వంటి వారు అండగా ఉండేవారు. కానీ ఇప్పుడు వారంతా దూరమయ్యారు. తనకంటూ మనుషులు లేకుండా పోయారు. వై వి సుబ్బారెడ్డి ఉన్న ఆశించిన స్థాయిలో పనిచేయలేకపోతున్నారు. అందుకే తన సొంత మనిషిని ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్నారు జగన్మోహన్ రెడ్డి. ఇంకోవైపు కేసులు వెంటాడుతుండడంతో ప్రత్యామ్నాయ నాయకత్వం సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారట జగన్మోహన్ రెడ్డి. అందులో భాగంగా భారతీ రెడ్డిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమించాలని ఒక నిర్ణయానికి వచ్చారట. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## మియాపూర్‌లో ఓపెన్ నాలో గల్లంతు.. రెండు రోజులైనా జాడ లేదు...

**తెలంగాణ రక్షణ సేన డిమాండ్: ఓపెన్ నాలాలకు రక్షణ కల్పించాలి.....**



మియాపూర్ క్రైమ్ మిర్రర్ :: మియాపూర్ పరిధిలోని వైశాలి నగర్, నారాయణ ఎస్టేట్స్ వద్ద మంగళవారం రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య ఓపెన్ నాలాలో పడి బాలయ్య అనే వ్యక్తి గల్లంతైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఘటన జరిగి రెండు రోజులు గడిచినా ఇప్పటివరకు బాలయ్య ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి వాసిలి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు తెలంగాణ రక్షణ సేన నాయకులు గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం హైడ్రాపై దృష్టి పెట్టడంతో పాటు నగరంలోని ఓపెన్ నాలాలు, ప్రమాదకర డ్రైనేజీల భద్రతపైనా ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.వర్షాకాలంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఓపెన్ నాలాలను మూసివేయడం, రక్షణ గోడలు ఏర్పాటు చేయడం, హెచ్చరిక బోర్డులు పెట్టడం వంటి చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలను మరింత వేగవంతం చేయడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు జరగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని తెలంగాణ రక్షణ సేన నాయకులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన నాయకులు విష్ణువర్ధన్ చారి, షేక్ అస్లాం, మురుగేషన్, సలాం తదితరులు పాల్గొన్నారు.






ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ది పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా

# ప్రతిపక్షంగా విఫలం అవుతున్న కాంగ్రెస్ !

తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామమాలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

# స్వేచ్ఛను సాధించడం ఒక ఎత్తు... కాపాడుకోవడం మరొక ఎత్తు!

**స్వేచ్ఛ అనే పదం వినగానే మన కళ్ల ముందు మెదిలేది సంకెళ్లు తెంచుకున్న దృశ్యం, బానిసత్వ సంకెళ్లు తెగిపడిన చారిత్రాత్మక క్షణం. అయితే వర్తమాన సామాజిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా లోతుగా విశ్లేషిస్తే స్వేచ్ఛను సాధించడం కేవలం ఒక చారిత్రక ఘట్టం మాత్రమేనని, దానిని ప్రతిరోజూ కాపాడుకోవడమే పౌర సమాజానికి అసలైన అగ్నిపరీక్ష అని స్పష్టమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా చరిత్ర పుటలు తిరగేస్తే ఎన్నో దేశాలు నిరంకుశ పాలకుల కబంధ హస్తాల నుండి విముక్తి పొందాయి.**

కానీ ఆ విముక్తి ఫలాలను శాశ్వతంగా నిలబెట్టుకున్న దేశాలు మాత్రం వేళ్ల మీద లెక్కించదగినవిగానే మిగిలాయి. ఎందుకంటే స్వేచ్ఛ అనేది ఒకసారి సాధించి షెల్ఫ్‌లో పెట్టుకునే విజయోత్సవ ట్రోఫీ కాదు, అది పౌరుల నిరంతర చైతన్యంతో సాగే ఒక సుదీర్ఘ పోరాటం.మన భారతదేశం విషయానికొస్తే, 1947లో బ్రిటిష్ రౌడీ పాలన నుండి విముక్తి పొందడం వెనుక దశాబ్దాల తరబడి సాగిన అకుంఠిత పోరాటం, వేలాది మంది అమరవీరుల రుధిర త్యాగాలు దాగి ఉన్నాయి. భగత్ సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ వంటి యువ విప్లవకారులు ఉరికొయ్యలను సైతం చిరునవ్వుతో ఆలింగనం చేసుకున్నారు. మహాత్మా గాంధీజీ అహింసా మార్గంలో లక్షలాది మంది సామాన్యులను కదిలించి మహా ఉద్యమంగా మలిచారు. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి నుండి మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వరకు ఎందరో ధీరులు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారు. రాబోయే భావితరాలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవాలన్నదే వారి ఏకైక ఆశయం. కానీ ఆ త్యాగాల విలువను నేటి తరం ఎంతవరకు గుండెల్లో నిలుపుకుంటోంది? ఆగస్టు 15, జనవరి 26న జెండా వందనం చేసి, దేశభక్తి గీతాలు ఆలపించి, మరుసటి రోజు నుంచే మామూలు దినచర్యల్లో మునిగిపోవడమేనా మన బాధ్యత? ఇక్కడే ప్రజాస్వామ్య సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. స్వేచ్ఛను స్వంతం చేసుకోవడం ఒక తరం సాధించిన విజయమైతే, దానిని పరిరక్షించుకోవడం ప్రతి తరం మోయాల్సిన గురుతర బాధ్యత.ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే ఇదే సత్యం పునరావృతమవుతుంది. ఫ్రెంచ్ విప్లవం రాచరికాన్ని కూలదోసి సమానత్వం, స్వేచ్ఛను ఆకాంక్షించింది. కానీ కొన్నేళ్లలోనే అది భీభత్స పాలనలోకి జారిపోయింది. రష్యన్ విప్లవం జార్ చక్రవర్తుల నిరంకుశత్వాన్ని అంతం చేసినప్పటికీ, ఆ తర్వాత మరో రూపంలో నిరంకుశత్వానికి దారి తీసింది. అనేక ఆఫ్రికన్, లాటిన్ అమెరికన్ దేశాలు వలస పాలన నుండి విముక్తి పొందిన కొన్నేళ్లలోనే సైనిక తిరుగుబాట్లు, అంతర్గత కలహాలు, రక్తపాతంతో అట్టుడికాయి. ఈ సంఘటనలు పౌర సమాజానికి స్పష్టమైన హెచ్చరికలు చేస్తున్నాయి. నిరంకుశత్వం నుండి బయటపడటం మొదటి అడుగు మాత్రమే. ప్రజాస్వామ్య వ్యవస్థలను, పౌర హక్కులను, రాజ్యాంగ బద్ధమైన చట్ట పాలనను కాపాడుకోవడం అనేది నిరంతర జాగరూకతతో కూడిన ప్రయాణం. పౌరులు ఏమరుపాటుగా ఉంటే స్వేచ్ఛ నెమ్మదిగా, మనకు తెలియకుండానే చేతి వేళ్ల సందుల నుంచి జారిపోతుంది.నేటి ఆధునిక సమాజంలో మన స్వేచ్ఛకు పొంచి ఉన్న ప్రమాదాలు విదేశీ తుపాకులు, సంకెళ్ల రూపంలో లేవు. అవి అత్యంత సూక్ష్మంగా, సమాజాన్ని లోలోపల నుంచి తొలిచేసే ప్రమాదకర శక్తులుగా మారాయి. పాలనా వ్యవస్థల్లో అవినీతి మూలాలు పాతుకుపోవడం, పౌరులు తమ అమూల్యమైన ఓటు హక్కును నిర్లక్ష్యం చేయడం, సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు సమాచారాన్ని, విషప్రచారాన్ని గుడ్డిగా నమ్మడం, మత విద్వేషాలను రెచ్చగొట్టే మూకలకు మౌన మద్దతు ఇవ్వడం ఇవన్నీ ప్రజాస్వామ్య స్వేచ్ఛను లోపలి నుండి తినేసే చెదపురుగులు. ఒక పౌరుడు ఓటు వేయడానికి బద్ధకించడం, అన్యాయం జరిగినప్పుడు ప్రశ్నించకుండా మిన్నకుండిపోవడం, సామాజిక అసమానతలను చూసీచూడనట్లు వదిలేయడం చిన్న రాజీలుగా అనిపించవచ్చు. కానీ కాలక్రమేణా ఇవే ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరుస్తాయి. నిరంకుశత్వం ఎప్పుడూ ఒక్కసారిగా రాదు; అది ప్రజల నిర్లక్ష్యం, భయం, సామాజిక విభజన అనే మెట్లపై నుంచి నెమ్మదిగా సింహాసనాన్ని అధిరోహిస్తుంది.



స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను నిలబెట్టుకోవడం కేవలం పాలకులు, ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; అది ప్రతి ఒక్క పౌరుడి ప్రాథమిక కర్తవ్యం. చదువుకున్న నవ సమాజం, యువత రాజకీయ పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలి. ప్రశ్నించే తత్వాన్ని, హేతుబద్ధమైన ఆలోచనలను అలవర్చుకోవాలి. చట్టాన్ని గౌరవించడం, నిబంధనలు పాటించడం, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా నడుచుకోవడం, భావ ప్రకటనా స్వేచ్ఛను బాధ్యతాయుతంగా వినియోగించడం స్వేచ్ఛా వ్యవస్థకు దృఢమైన స్తంభాలు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా నిజాయితీ, సమన్యాయం, సహనం వంటి విలువలను నూరిపోయాలి. నాలుగో స్తంభమైన మీడియా సత్యాన్ని నిర్భయంగా వెలికితీయాలి. న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఈ వ్యవస్థలన్నీ సక్రమంగా పనిచేసినప్పుడే స్వేచ్ఛ అనే వృక్షం ఏపుగా పెరిగి సమాజానికి నీడనిస్తుంది. ప్రసిద్ధ అమెరికన్ రాజనీతిజ్ఞుడు థామస్ జెఫర్సన్ పేర్కొన్నట్లు, నిరంతర జాగరూకతే స్వేచ్ఛకు మనం చెల్లించాల్సిన అసలైన మూల్యం. ఈ సూక్తి సార్వకాలికమైనది. స్వాతంత్ర్య పోరాట యోధులు రక్తం చిందించి మనకు అందించిన స్వేచ్ఛను కేవలం అనుభవించడమే కాకుండా, దానిని మరింత పటిష్టం చేసి భావితరాలకు పదిలంగా అందించాల్సిన గురుతర బాధ్యత మన అందరిపై ఉంది. ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి చైతన్యవంతంగా మెలిగినప్పుడే స్వేచ్ఛ అనేది కేవలం చరిత్ర పుస్తకాలకే పరిమితం కాకుండా, సమాజ జీవన విధానంగా భాసిల్లుతుంది. స్వేచ్ఛను సాధించడం ఒకనాటి పోరాటం కావచ్చు .కానీ దానిని కాపాడుకోవడం నిరంతర జీవితకాల నిబద్ధత!



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

## చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

### చైనా తీరుపై ట్రంప్ అసహనం



వాషింగ్టన్,జూలై30: అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

## ఓటరు జాబితా సవరణతో పథకాలకు సంబంధం లేదు

### ప్రజలు అనవసర అపోహలకు గురి కావద్దు

### ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా చేపడుతున్న ఓటరు జాబితా సవరణకు, ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ పక్రియ పురోగతిపై జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్లతో ఎస్ఐఆర్ పక్రియలో భాగంగా డిజిటలైజేషన్ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పక్రియ కేవలం తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు మాత్రమేనని, ప్రభుత్వం పథకాలకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాలను సమర్పించేందుకు మరో నాలుగు రోజులు గడువు మాత్రమే ఉన్నందున ఆగస్టు మూడవ తేదీలోగా డిజిటలైజేషన్ పక్రియ 100శాతం పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 76శాతం డిజిటలైజేషన్ పక్రియ పూర్తయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 90శాతం పూర్తయిందని, ఇందులో ఖానాపూర్, బాల్కొండ, ఎల్లారెడ్డి, హుజూర్ నగర్, నర్సంపేట్, వర్ధన్నపేట్, పరకాల, బోద్ నియోజకవర్గాల్లో 100శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఇందుకు సంబంధించిన అధికారులను సిఇఓ ప్రశంసించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డి, మేడ్చల్, జిహెచ్‌ఎంసితో పాటు నిజామాబాద్, వరంగల్, ఖమ్మం లిం పట్టణ ప్రాంతాలలో డిజిటలైజేషన్ పక్రియపై సంబంధిత డిఇఓలు ప్రత్యేక దృష్టి సారించి డిజిటలైజేషన్ పక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎన్యూమరేషన్ ఫారాలను డిజటలైజేషన్ చేయడంలో ఓటరు పేర్లను తప్పులు లేకుండా అప్ లోడ్ చేసేలా బిఎల్ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇఆర్ఓ, ఎఇఆర్ఓలు దీనిపై సమీక్షించి తప్పులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. డిజిటలైజేషన్ లో నిర్లక్ష్యం వహించిన బిఎల్ఓలు, సూపర్ వైజర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని సిఇఓ హెచ్చరించారు.

# ఆగస్టు 10 న " జైల్ భరో " కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

## తెలంగాణ వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ్మా పిలుపు





**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 30(క్రైమ్ మిర్రర్):** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక , రైతు, వ్యవసాయ కార్మికుల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 2026 ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జైల్ భరో ' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్ ముట్టడిలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండమడుగు నర్సింహ్మా పిలుపునిచ్చారు. గురువారం పోచంపల్లి మండల కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కన్వీనర్ మంచాల మధు అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని " సదస్సు" నిర్వహించడం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ , అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఆగస్టు 10న దేశవ్యాప్త నిరసనలను చేపట్టాలని నిర్ణయించారని తెలిపారు. ప్రధానంగా కేంద్రంలోని మోడీ నాయకత్వంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా కార్మికుల, కర్షకుల వ్యవసాయ కూలీల జీవనం మీద, వారి హక్కుల మీద దాడి చేస్తుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం పరిశ్రమ అధిపతులకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి రోజువారీ పని గంటలను 8 నుండి 12 గంటలకు పెంచిందని, చట్టాలలో అనేక మార్పులు తెచ్చిందని దీనిని కార్మికులంతా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్మికులకు నెలకు రూ.26,000 కనీస వేతనం మరియు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేసినారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం అన్ని పంటలకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధర ( ఎంఎస్పి ) అమలు చేయాలని, రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని, విత్తన చట్టాన్ని, విద్యుత్తు సవరణ బిల్లును తక్షణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టం ను ఎత్తివేసి తీసుకువచ్చిన విబిజి గ్రామ్ జీ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించి, రోజువారీ కనీస వేతనంగా రూ.800 చెల్లించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల లాభాల కోసం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరంచేసే విధానాలను విరమించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు భూ పంపిణీ జరపాలని, ఇండ్ల స్థలాలు కేటాయించాలని సూచించారు. దేశ వ్యవసాయాన్ని దెబ్బతీసే విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ( ఎఫ్టిఏ ) రద్దు చేయాలని, జాతీయ ఆహార భద్రత చట్ట సవరణ కూడా ప్రభుత్వం విరమించుకోవాలనే డిమాండ్ల సాధనకై నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమంలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు ప్రసాదం విష్ణు, సిఐటియు పట్టణ కన్వీనర్ వడ్డేపల్లి యాదగిరి పాల్గొని మాట్లాగ ప్రజా సంఘాల నాయకులు గూడూరు రామ్ రెడ్డి, కలకొండ బాబు, కోట రమేష్, జంగారెడ్డి, జయమ్మ , జనార్దన్ రెడ్డి, శంకర్, స్వామి, ఇస్తారి, దశరత, నర్సింహ, శారద తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

### చౌటుప్పల్ టి.జి.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ టి.విజిత



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో,జూలై 30(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.విజిత గురువారం పత్రికకు ఇచ్చిన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల ఆగస్టు 3వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులను చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తు తో పాటు వారి ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు, బోనఫైడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరి జత చేయాలని తెలిపారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఆగస్టు 5వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సర్వేల్ లోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరి ఇట్టి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలి

### అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్




**నల్లగొండ, జూలై 30(క్రైమ్ మిర్రర్):** మహిళలకు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు నల్లగొండ బస్టాండ్ లో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ప్రజల నుంచి విస్తృతంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించి కూడా అమలు చేయకపోవడం మహిళలను మోసం చేయడమేనని విమర్శించారు. మహిళల రాజకీయ సాధికారతకు, నిర్ణయాత్మక వ్యవస్థల్లో వారి భాగస్వామ్యం పెరగడానికి ఈ చట్టాన్ని ఎలాంటి జాప్యం లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలులోకి రావాలని, "హామీలు కాదు... హక్కులు కావాలి" అని ఆమె అన్నారు. "మహిళల రాజకీయ భాగస్వామ్యమే ప్రజాస్వామ్య బలోపేతం" అని పేర్కొంటూ, 33 శాతం రిజర్వేషన్ అమలే మహిళా సాధికారతకు నిజమైన అడుగని అన్నారు. చట్టం చేసి అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదని, మహిళలకు న్యాయం చేయాలంటే రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్, శాసనసభల్లో మహిళల గొంతు బలంగా వినిపించాలంటే 33 శాతం రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు కావాలని, "రిజర్వేషన్ మా హక్కు -- అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత" అని స్పష్టం చేశారు. సమానత్వం మాటల్లో కాకుండా చట్టాల అమలులో కనిపించాలని ఆమె అన్నారు. ఈ సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, దేశవ్యాప్తంగా మహిళల రాజకీయ హక్కుల సాధన కోసం ఐద్వా పోరాటాలను మరింత ఉధృతం చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన, జిల్లా కమిటీ సభ్యులు కౌసల్య, సైదమ్మ, కళమ్మ, అనిత సిహెచ్ పద్మ కోటమ్మ యశోద అశ్విని మల్లేశ్వరి దుర్గాబాయి తదితర మహిళలు పాల్గొన్నారు.

# మిస్సింగ్ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు....




**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమంలో భాగంగా మియాపూర్ పోలీసులు బిక్షాటన చేస్తున్న ఒక బాలుడిని సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. జూలై 28న మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కలిసి రక్షించారు. బాలుడి నుంచి సరైన సమాచారం రాకపోవడంతో అతడిని రంగారెడ్డి జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించి, ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.ఆ తర్వాత ఆపరేషన్ ముస్కాన్-12 బృందం వివిధ పోలీస్ స్టేషన్లలో ఆరా తీయగా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌లో జూలై 26న బాలుడు మిస్సింగ్ అయినట్లు ఫిర్యాదు నమోదైనట్లు గుర్తించారు. బిక్షాటన చేస్తున్న బాలుడు, మిస్సింగ్ ఫిర్యాదులో ఉన్న బాలుడు ఒకరేనని నిర్ధారించి, కుటుంబ వివరాలను సేకరించారు.చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం బాలుడికి కౌన్సెలింగ్ ఇచ్చి, అల్లాపూర్ ఎస్హెచ్ఓ ఆధ్వర్యంలో బుధవారం తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. బాలుడిని తిరిగి పొందిన తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మియాపూర్ ఎస్ఐ కృష్ణయ్య, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు శ్రవణ్ కుమార్, దేవేంద్ర చారి, ఏహెచ్టీయూ పీసీ షారూఖ్, విజయ్ భాస్కర్ రెడ్డి, మోతిలాల్, అనిల్ కుమార్, జహీదా మరియు ఆపరేషన్ ముస్కాన్-12 బృంద సభ్యులు పాల్గొన్నారు.




# టీచర్ సాయమొల్ల చంద్రయ్య సేవలు ఆదర్శనీయం: భీమ్ గొండ

### ఘనంగా సాయమొల్ల చంద్రయ్య పదవీ విరమణ కార్యక్రమం

### ఉపాధ్యాయ వృత్తి గొప్పది విధి నిర్వహణే శాశ్వత గుర్తింపు

### సేవలకు ఘన నివాళి, సన్మాన సభలో పలువురి ప్రశంసలు

### విధి నిర్వహణలో చేసిన సేవలే ఉద్యోగికి గుర్తింపు

హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 30: విధి నిర్వహణలో నిబద్ధతతో చేసిన సేవలే ఉద్యోగికి శాశ్వత గుర్తింపునిస్తాయని సీఎంఓ భీమ్ గొండ అన్నారు. గురువారం హత్నూర మండలంలోని కాసాల గ్రామ శివారులోని బీఎన్ రెడ్డి గార్డెన్‌లో హత్నూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ సాయమొల్ల చంద్రయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఉపాధ్యాయ వృత్తి అత్యంత గొప్పదని, చంద్రయ్య విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, అనంతర జీవితం ఆయురారోగ్యాలతో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన చంద్రయ్య మాట్లాడుతూ.. తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు మూల వెంకట్ స్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత నర్సింగ్ రాజ్, రాష్ట్ర నాయకుడు దశరథ, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మాదరి బాల్‌రాజ్, నల్గొండ జిల్లా అధ్యక్షులు బిక్షపతి గోపాల్, గుండ్ల మాచునూర్ సర్పంచ్ శ్రీహరి, హత్నూర సర్పంచ్ ఎల్లయ్య, కాసాల పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు చెక్క రవి, నరేందర్, తోటి ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, బంధుమిత్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో

# స్పాట్ అడ్మిషన్లు

### ఖాళీ సీట్ల భర్తీకి ఆగస్టు 5 వరకు దరఖాస్తులకు ఆహ్వానం

### నాణ్యమైన ఉచిత విద్యతో కార్పొరేట్ స్థాయి వసతులు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో జూలై 30 (క్రైమ్ మిర్రర్):** గుండాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని అర్హత కలిగిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బాలికలకు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు కార్పొరేట్ స్థాయి వసతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, ఆధునిక డార్మిటరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, అంకితభావంతో బోధించే ఉపాధ్యాయులు, మెనూ ప్రకారం రుచికరమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, శానిటరీ నాప్‌కిన్ వెండింగ్ మెషిన్లు, హెల్త్ కేర్ రికార్డుల నిర్వహణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, 24 గంటల భద్రత, సీసీ కెమెరాల నిఘా వంటి అన్ని సౌకర్యాలు విద్యార్థినులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రస్తుతం 6వ తరగతిలో 6 సీట్లు, 7వ తరగతిలో 8 సీట్లు, అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం అగ్రికల్చర్ (క్రాప్ ప్రొడక్షన్) విభాగంలో 18 సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.ఆసక్తి కలిగిన అర్హత గల విద్యార్థినులు ఆగస్టు 5లోపు సంబంధిత పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌ను (ఎస్.ఓ.) నేరుగా సంప్రదించి ప్రవేశాలు పొందాలని స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి కోరారు.

# భారీ వర్షానికి ఎర్రగుంటపల్లి గ్రామంలో కూలిన ఇల్లు

**మందమర్రి టౌన్ జులై 30 క్రైమ్ మిర్రర్:** మందమరి మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామంలో నివాసముంటున్న ఉమ్మల బక్కయ్య ఇల్లు గోడ గురువారం కురిసిన వర్షానికి కూలిపోయింది. ఈ ఘటనతో ఇంట్లో ఉన్న సామాగ్రి మొత్తం ధ్వంసం అయింది. కుటుంబ సభ్యులు సురక్షితంగా బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది. వారికి వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని ఇల్లును మరమ్మత్తు చేసి ఇవ్వాల్సిందిగా వేడుకుంటున్నారు.



# రాయదుర్గం పోలీసులు, కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ కార్డుల పంపిణీ..

సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ : సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ మరియు తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం "భవన నిర్మాణ కార్మికుల నమోదు కార్డుల పంపిణీ మరియు కార్మిక సంక్షేమ అవగాహన కార్యక్రమం" ఘనంగా నిర్వహించారు. ఖాజాగూడలోని ఎస్ఏ ఎస్ । టవర్స్ లో సాయంత్రం 4 గంటలకు జరిగిన ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ రెడ్డి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కూకట్‌పల్లి జోన్ డీసీపీ శ్రీమతి రీతిరాజ్, ఐపీఎస్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్, కూకట్‌పల్లి జోన్ అదనపు డీసీపీ ఎం. సుదర్శన్, మాదాపూర్ డివిజన్ ఏసీపీ చి. శ్రీధర్, శేరిలింగంపల్లి సహాయ కార్మిక అధికారులు వినీల, రేణుక, రాయదుర్గం ఎస్‌హెచ్ఓ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 256 మంది అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ( బీ ఓ సీ డబ్ల్యుయ్యు) నమోదు



కార్డులను అతిథులు అందజేశారు. కమిషనర్ ఎం. రమేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. నమోదు చేసుకున్న కార్మికులకు ఈ ఎస్ ఐ, ఈ పీ ఎఫ్ బీమా, వివాహ సహాయం, ప్రసూతి సహాయం, ప్రమాద/సహజ మరణ పరిహారం, వైకల్య సహాయం, ఆసుపత్రి చికిత్స, అంత్యక్రియల సహాయం, నైపుణ్య శిక్షణ, ఉచిత ఆరోగ్య పరీక్షలు వంటి ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. రాయదుర్గం పరిధిలోని నిర్మాణ సంస్థలు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి అర్హత కలిగిన కార్మికుడిని తప్పనిసరిగా సంక్షేమ బోర్డులో నమోదు చేయించాలని అధికారులు బిల్డర్లకు సూచించారు. దీనికి బిల్డర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, ప్రతి అర్హ కార్మికుడు నమోదు చేసుకుని ప్రయోజనాలు పొందాలని ముఖ్య అతిథులు పిలుపునిచ్చారు.



## సోను సూద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోను సూద్ జన్మదిన వేడుకల్లో భాగంగా రక్తదానం & లోగో ఆవిష్కరణ

### ఫౌండర్ ఽ అధ్యక్షులు . సోను సూద్ శివ నేటి యువతకు ఆదర్శం : నడిమింటి శ్రీనివాస్

మహబూబ్ నగర్, జులై 30 (క్రైమ్ మిర్రర్):: సోను సూద్ ఫౌండేషన్ మహబూబ్ నగర్ పట్టణంలో ఎర్ర సత్యం చౌరస్తాలోని మినీ పంక్షన్ హాల్లో ఫౌండర్ ఽ అధ్యక్షులు సోను సూద్ శివ అధ్యక్షతన సోను సూద్ సర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్త దానం మరియు లోగో ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపి మిథున్ రెడ్డి, కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, నవకాంత్, ఉమర్ కొత్వాల్ హాజరయ్యారు. అదేవిధంగా ఫౌండేషన్ ఆహ్వానం మేరకు నేషనల్ ధోబి రిజర్వేషన్ సంఘ్ జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక, మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షులు కేతూరి శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సి. సతీష్ ,పట్టణ అధ్యక్షులు ఎస్ నాగరాజు హాజరయ్యారు. జాతీయ కన్వీనర్ నడిమింటి శ్రీనివాస్ మాట్లాడుతూ రక్త దానం మహాదానం హాస్పిటల్ లో రక్తం అందక అనేక మంది చనిపోతున్నారు కాబట్టి సమాజంలో ఎన్ని స్వచ్ఛంద సంస్థలు పనిచేసిన సరైన సమయానికి రక్తం అందక అనేక ఇబ్బందులకు గురవుతున్న సోను సూద్ ఫౌండేషన్ వారి వంతుగా సంస్థను ఏర్పాటు చేసి ఇప్పటివరకు 6 వేలకు పైబలుకు రోగులకు రక్తం అందించడమే కాకుండా కరోనా సమయంలో కూడా శవాలకు దహన సంస్కారాలు చేసి వారి ధాతృత్వాన్ని చాటుకున్నారు. వారు సమాజంలో అనేక కార్యక్రమాలు చేసి ఇంకా పైకి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సి. మనోహర్ , ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ గౌడ్, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ ముభరక్, కోశాధికారి విజయ్ కుమార్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. మంజునాథ్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ పి. సాయికుమార్, హరీష్ ,ఎగ్జిక్యూటివ్ మెంబర్ విష్ణువర్ధన్ రెడ్డి, కె. శివాచారి ,యుగేంధర్ రెడ్డి , డాక్టర్ వెంకటయ్య , న్యాయవాది పూర్ణ చందర్ గౌడ్,మహిళలు మేధావులు ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా ప్లాంటేషన్ ప్రారంభించిన డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్



మందమర్రి టౌన్ జులై 30 క్రైమ్ మిర్రర్: పర్యావరణ పరిరక్షణ పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో సింగరేణి మందమర్రి ఏరియా పరిధిలోని కాసిపేట రెండవ గని ప్రాంగణంలో గురువారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం జిఎం ఎన్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా డి.ఎఫ్.ఓ రాహుల్ కిషన్ జాదవ్ హాజరై 2000 మొక్కలను నాటారని తెలిపారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో సింగరేణి ఉద్యోగులు, ముఖ్యంగా మహిళా కార్మికులు అత్యంత ఉత్సాహంతో ముందుకు వచ్చి మొక్కలు నాటడంలో భాగస్వాములు కావడం ఎంతో అభినందనీయమని అన్నారు.ఒక మొక్కను నాటడం అంటే ఒక ప్రాణాన్ని నిలబెట్టడమే అని పచ్చదనమే జీవకోటికి ప్రాణాధారమని మారుతున్న వాతావరణ మార్పులను తట్టుకోవాలన్నా, కాలుష్య రహిత వాతావరణాన్ని అందించాలన్నా ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో, పని ప్రదేశాల్లో మొక్కలు నాటడం సామాజిక బాధ్యతగా భావించాలని పేర్కొన్నారు.సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు పర్యావరణ పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యత ఎంతో ఆదర్శనీయం" అని ఆయన తెలిపారు. అనంతరం మందమర్రి ఏరియా జిఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వర్షపు వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒకే రోజు 2,000 మొక్కలు కాసిపేట-రెండు గని పైనాటడం అభినందనీయమని తెలిపారు.సింగరేణి పరిధిలోని ఖాళీ స్థలాలతో పాటు, పర్యావరణ సమతుల్యత కోసం ఈ ఏడాది 38 హెక్టార్ల 'సిప్',సింగరేణిలో ఖాళీగా ఉన్న ల్యాండ్‌లో మొత్తం 1,80,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు.నిబంధనల ప్రకారం ప్లాంటేషన్ కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఎం.ఓ.ఈ.ఎఫ్ నిబంధనలకు అనుగుణంగా సింగరేణి పరిధిలోని 19 ఓపెన్ కాస్ట్ గనుల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలను పక్కాగా అమలు చేస్తున్నామని అన్నారు.పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కేవలం ఒక సంస్థకి, ప్రభుత్వానికి పరిమితం కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటు బెల్లంపల్లి విజయకుమార్, ఎఫ్ఆర్ఓ బెల్లంపల్లి పూర్ణచందర్,ఎఫ్ఆర్ఓ మంచిర్యాల సర్వేశ్వరరావు,ఎస్ఓటు జిఎం జివిల్ ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, కాసిపేట-రెండు గని మేనేజర్ బారపాటి రమేష్, కేకే ఏజెంట్ కాదిర్, శాంతి ఖని ఏజెంట్ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల హక్కుల సాధన చైతన్య యాత్ర విజయవంతం చేయాలి

## గుండాల మండల కేంద్రంలో ఘనంగా గీత కార్మికుల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో , జులై 30(క్రైమ్ మిర్రర్): గుండాల మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న గీత కార్మికుల చైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 2 నుంచి 18 వరకు నిర్వహించనున్న ఈ చైతన్య యాత్రను విజయవంతం చేయాలనే సంకల్పంతో గీత కార్మికులు, గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గీత కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు నేటికీ పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వేలాది కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని, ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చైతన్య యాత్ర ద్వారా గీత కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉపాధి భద్రత, ప్రమాద బీమా, పెన్షన్, ఆర్థిక సహాయం, వృత్తి పరిరక్షణ వంటి అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. గీత కార్మికులందరూ కుల, ప్రాంత భేదాలకు అతీతంగా ఐక్యంగా ముందుకు



వచ్చి యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 2 నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర రాష్ట్రంలోని పలు జిల్లాల మీదుగా కొనసాగి ఆగస్టు 18న హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద ముగుస్తుందని పేర్కొన్నారు. యాత్ర విజయవంతమైతే గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించే అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూదగాని రామచంద్రయ్య గౌడ్, పొడిచేటి వెంకన్న గౌడ్, ఎలికట్టె శేఖర్ గౌడ్, పాటు గుండాల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గౌడ కులస్తులు, గీత కార్మికులు పాల్గొని పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చైతన్య యాత్రను విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ గీత కార్మికుల ఐక్యతను చాటిచెప్పారు.

## బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి



బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్

గండిపేట్, (క్రైమ్ మిర్రర్): బీసీలకు స్థానిక సంస్థలు, శాసనసభ, పార్లమెంటులో జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి డిమాండ్ చేసింది. గురువారం రాజేంద్రనగర్ మండల కార్యాలయంలోని ఏఐటీ దేవరాజ్ భవన్‌లో నిర్వహించిన నియోజకవర్గ సమావేశంలో ఈ మేరకు పలువురు నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్నాటి యాదయ్య, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా భారత కమ్యూనిస్టు పార్టీ మాజీ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర నియంత్రణ కమిషన్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్‌రావు ముఖ్య అతిథులుగా హాజరుకాగా, రాజేంద్రనగర్ మండల ఇన్‌ఛార్జి జే ఆనంద్ గౌడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పల్నాటి యాదయ్య, పుస్తకాల నర్సింగ్‌రావు మాట్లాడుతూ బీసీల జనాభాకు అనుగుణంగా అన్ని రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, ప్రతి ఆర్థిక సంవత్సరంలో వార్షిక బడ్జెట్‌లో 50 శాతం నిధులను బీసీల అభివృద్ధికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్థికంగా బలహీన వర్గాల రిజర్వేషన్లను పునఃసమీక్షించి, బీసీల ప్రయోజనాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నియామకాలకు సంబంధించిన 29వ ప్రభుత్వ ఉత్తర్వును రద్దు చేయడంతో పాటు మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు 50 శాతం ఉపకోటా కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అనంతరం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాలకు బీసీ హక్కుల సాధన సమితి నూతన కమిటీలను ఎన్నుకున్నారు. రాజేంద్రనగర్ మండల గౌరవ అధ్యక్షుడిగా జే ఆనంద్ గౌడ్, అధ్యక్షుడిగా జే సదానంద గౌడ్, ఉపాధ్యక్షుడిగా గుజ్జరి శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా కె మనోజ్, సహాయ కార్యదర్శిగా కె మౌనికతో పాటు 15 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. గండిపేట్ మండల అధ్యక్షుడిగా ఆర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఎం గోపాల్‌తో పాటు 11 మంది సభ్యులను, శంషాబాద్ మండల అధ్యక్షుడిగా డి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కావలి మల్లేష్‌తో పాటు 11 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ శంషాబాద్ కార్యదర్శి నర్సిరెడ్డి, గండిపేట్ కార్యదర్శి మల్లేష్, రాజేంద్రనగర్ మండల సహాయ కార్యదర్శి జే విజయ్ ఆనంద్ గౌడ్, భారత జాతీయ మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షురాలు కన్యగారి లక్ష్మి, రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలు మునేశ్వరి, కార్యాలయ కార్యదర్శి జి సత్యం, గంగారం, శాలిని, జ్యోతి, మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.



## గర్భంలోనే గుర్తించిన అరుదైన అండాశయ కణితికి విజయవంతమైన శస్త్రచికిత్స

గండిపేట్, (క్రైమ్ మిర్రర్): పుట్టుకతోనే ఎడమ అండాశయంలో అరుదైన కణితితో జన్మించిన ఓ నవజాత ఆడ శిశువుకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. గర్భధారణ సమయంలో తల్లి హార్మోన్ల ప్రభావంతో కొందరు ఆడ శిశువుల్లో అండాశయంలో కణితులు ఏర్పడే అవకాశం ఉంటుందని వైద్యులు తెలిపారు. చిన్న కణితులు సాధారణంగా స్వయంగా తగ్గిపోతాయని, అయితే పెద్ద కణితులు ఉంటే అండాశయం మెలిక తిరగడం, పగిలిపోవడం, రక్తస్రావం, సంక్రమణ, శాశ్వత నష్టం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల శంషాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందిన ప్రీటర్మ్ ఆడ శిశువుకు అల్ట్రాసౌండ్ పరీక్షల్లో ఎడమ అండాశయంలో పెద్ద కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా అండాశయాన్ని సంరక్షించే లక్ష్యంతో నిపుణుల బృందం శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించింది. పీడియాట్రిక్ వైద్య నిపుణుడు ప్రశాంత్ బాబు నేతృత్వంలో శిశువుకు అత్యాధునిక పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించి కణితిని విజయవంతంగా తొలగించారు. ఈ సందర్భంగా అండాశయ కణజాలాన్ని సాధ్యమైనంత వరకు సంరక్షించినట్లు తెలిపారు. పరీక్షల్లో ఇది హానికరం కాని కణితి అని నిర్ధారణ అయింది. శస్త్రచికిత్స అనంతరం నవజాత శిశువుకు ప్రత్యేక శిశు సంరక్షణ విభాగంలో నిరంతర వైద్య పర్యవేక్షణ అందించారు. శరీరంలోని లవణాల సమతుల్యతను సరిచేసి, క్రమంగా తల్లిపాలను ప్రారంభించారు. సంక్రమణ రాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ బహుళ విభాగాల వైద్యుల సమన్వయంతో చికిత్స అందించారు. సకాలంలో చికిత్స అందడంతో శిశువు పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా మారింది. అనంతర పరీక్షల్లో కణితి పూర్తిగా తొలగిపోయినట్లు నిర్ధారణ కావడంతో వైద్యుల సూచనల మేరకు శిశువును ఆరోగ్యంగా ఇంటికి పంపించారు. గర్భధారణ సమయంలో నిర్వహించే పరీక్షలు, పుట్టిన వెంటనే నవజాత శిశువుకు చేసే ఆరోగ్య పరీక్షల ద్వారా ఇటువంటి పుట్టుకతో వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి విజయవంతంగా చికిత్స అందించవచ్చని ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. అత్యాధునిక వైద్య సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం సహకారంతో నవజాత శిశువులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొంది.

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం

- 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్, అదనపు ఎస్పీ సూచనలు
- ప్రజలకు సూచనలు:
- అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దు.
- వాగులు, వంకలు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదు.
- వరద నీరు ప్రవహిస్తున్న బ్రిడ్జిలను దాటే ప్రయత్నం చేయరాదు.
- విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన వైర్లకు దూరంగా ఉండాలి.
- శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలి.
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.
- అధికారుల హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలి.
- అత్యవసర సంప్రదింపు నంబర్లు:
- జిల్లా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్: 08455-276155, డయల్--100
- జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్: 8712656739





**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 30:** జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ప్రజల భద్రత కోసం జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. అత్యవసర ఫిర్యాదులు, నష్టం వివరాలు, వరదలు, రహదారి అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సమస్యలు వంటి సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖలకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించి చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్ 08455-276155కు లేదా డయల్--100 జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712656739. సమాచారం అందించాలని సూచించారు. అదే సమయంలో, ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. ఉప్పొంగుతున్న వాగులు, వంకలు, చెరువులు, బ్రిడ్జిలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు. అవసరం లేని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. విద్యుత్ తీగలు తెగిపడే ప్రమాదం ఉన్నందున విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన వైర్లకు దూరంగా ఉండాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రమాదకర ఆనకట్టలు, వాగులు, బ్రిడ్జిల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదేవిదంగా జిల్లా ప్రజలకు కూడ పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లరాదన్నారు. వరద నీరు ప్రవహిస్తున్న బ్రిడ్జిలను దాటే ప్రయత్నం చేయరాదని అన్నారు.

విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన వైర్లకు దూరంగా ఉండాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలకు దూరంగా ఉండాలని జాగ్రత్తలు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని హెచ్చరించారు. అధికారుల హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

అత్యవసర పరిస్థితులలో అధికారులను సంప్రదించాలని సూచించారు.

# కేంద్రంలో లీకేజీలు.. రాష్ట్రంలో కాళేశ్వరం దోపిడి!

## విద్యార్థులపై లాఠీఛార్జ్ దుర్మార్గం: కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి

## రూ.8 లక్షల కోట్ల అప్పున్నా సంక్షేమం ఆపేది లేదు: వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల జులై 30 ( క్రైమ్ మిర్రర్):** ఓవైపు నీట్ పేపర్ లీకేజీలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుంటే.. మరోవైపు గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరిట రూ.వందల కోట్ల కమిషన్లు దండుకుని రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసిందని రాష్ట్ర గనుల, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మండిపడ్డారు. మంచిర్యాలలోని తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో బాధిత విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ పూర్తి అభయం ఇచ్చిందని మంత్రి తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ నాయకత్వంలో తెలంగాణ ఎంపీలంతా కలిసి ప్రధాని నివాసాన్ని ముట్టడించారని గుర్తుచేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై పోలీసులు విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ ఘోర వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టు రీ-డిజైనింగ్ వెనుక పెద్ద ఎత్తున అవినీతి దాగుందని మంత్రి



ఆరోపించారు. బ్యారేజీలు కుంగిపోయి, సాంకేతిక సమస్యలు ఉన్నాయని ఇంజనీరింగ్ నిపుణులు స్పష్టం చేస్తుంటే.. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కేటీఆర్ సహా ఆ పార్టీ నాయకులు పంపులు ప్రారంభించాలంటూ సరికొత్త డ్రామాలకు తెరలేపారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల భారం పడిందన్నారు.గత పాలకులు రాష్ట్రంపై రూ.8 లక్షల కోట్ల అప్పుల భారం మోపి వెళ్లినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నిరంతరాయంగా అమలు చేస్తోందని స్పష్టం చేశారు. గృహ జ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం వంద శాతం విజయవంతంగా అమలవుతోందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు ఆర్థిక లబ్ధి చేకూరుతోందని, ఈ భారాన్ని ప్రభుత్వమే భరిస్తోందని పేర్కొన్నారు. అలాగే నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేశామని వెల్లడించారు.గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల బొగ్గు గనుల వేలంలో పాల్గొనక సింగరేణి తీవ్రంగా నష్టపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చొరవతో వేలంలో పాల్గొని తాడ్చర్ల, మణుగూరు ప్రాంతాల్లో కొత్త గనులను సాధించినట్లు వెల్లడించారు. దీనివల్ల సింగరేణి సంస్థ భవిష్యత్తుకు పూర్తి ధీమా లభించిందని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.



# నెమలినగర్ జేఎన్‌యూఆర్ఎం కాలనీ, 60 గజాల ప్రాంతంలో తాగునీటి సమస్యలపై అధికారుల పర్యటన

### ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలన

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ పరిధిలోని నెమలినగర్ జేఎన్‌యూఆర్ఎం కాలనీ, 60 గజాల ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిశీలించేందుకు జలమండలి మణికొండ డివిజన్ ఉప ప్రధాన నిర్వాహక అధికారి వెంకటేష్, మేనేజర్ మజీద్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. గత నెలలో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు కాలనీకి వచ్చిన సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు ప్రాంతాన్ని సందర్శించి ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేఎన్‌యూఆర్ఎం కాలనీలో ఒక బ్లాక్‌లోని 24 ఫ్లాట్లకు ఒకే నీటి కనెక్షన్ ఉండటంతో తాగునీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రతి ఫ్లాట్‌కు ప్రత్యేక నీటి కనెక్షన్ మంజూరు చేయాలని కాలనీవాసులు అధికారులను కోరారు. అలాగే 60 గజాల ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న తాగునీటి పైప్‌లైన్ సామర్థ్యం తక్కువగా ఉండటంతో సరిపడా నీరు అందడం లేదని, 185, 207 రహదారుల్లో కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఉప ప్రధాన నిర్వాహక అధికారి వెంకటేష్, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సిఫారసు లేఖ ఆధారంగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంటే ఎమ్మెల్యే సహకారంతో నీటి నిల్వ ట్యాంకు నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బోనాల పండుగ నేపథ్యంలో తాగునీటి అవసరం ఎక్కువగా ఉండటంతో నీటి సరఫరా సమయాన్ని మరో 30 నిమిషాలు పెంచాలని స్థానికులు కోరగా, వెంటనే సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసి నీటి సరఫరా సమయాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శ్రవణ్ కుమార్, జేఎన్‌యూఆర్ఎం కాలనీ సంఘం అధ్యక్షుడు డి. వంశీ, షరీఫ్, 60 గజాల సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, అశోక్, దండిగాల శ్రీను, రామాంజనేయులు, రఘు, మేకల అశోక్, నాగేష్ గౌడ్, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సై శోభన్ బాబుకు సన్మానం




**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు ఎస్సై శోభన్ బాబు ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వట్టికోటి శేఖర్, కోతులారం సర్పంచ్ జాల జంగయ్య ,గ్రామస్తులు సాధారణంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరం

### అల్లందేవిచెరువు కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క శేఖర్ యాదవ్

**సంస్థాన్ నారాయణపురం, జూలై 30(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం అల్లందేవిచెరువు గ్రామంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులు లబ్ధిదారులు గోధుమగడ్డ యాదిరెడ్డి, రూ.60,000, గోధుమగడ్డ కలమ్మ కి రూ.60,000 లకు చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బాత్క శేఖర్ యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పేదలు అవసరంలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ సహాయం అందించడంలో సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు గోధుమగడ్డ శేఖర్ రెడ్డి, గుండు రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిరెడ్డి జంగారెడ్డి, సుర్వి జంగయ్య, బాత్క రమేష్, గ్రామ ప్రజలు గుండు లింగస్వామి, సుర్వి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.





# ఉత్తమ రైతు పరమయ్య గారి జగదీశ్వర్ రెడ్డికి ఘన సన్మానం

**వనపర్తి జులై 30 క్రైమ్ మిర్రర్ :** పెబ్బేరు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కిసాన్ సెల్ మండల అధ్యక్షులు పరమయ్య గారి జగదీశ్వర్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో క్రమం తప్పకుండా హాజరవుతూ తన వ్యవసాయంలో వినూత్న పద్ధతులు అవలంబించి చక్కటి వ్యవసాయం చేసినందుకు గుర్తింపుగా ఇటీవల వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గారి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ రైతు పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. ఈ శుభ సందర్భాన్ని గుర్తించి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంతం దయాకర్ రెడ్డి. మరియు మండల కమిటీ ఆధ్వర్యంలో జగదీశ్వర్ రెడ్డి గారికి ఘన సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు శివసాయ్ తాటికొండ కృష, భాగ్యలక్ష్మి శివ, పర్వీన్ షకీల్,జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ దీూూ 2 లు మాజీ సర్పంచులు సురేందర్ గౌడ్, వెంకటేష్ సాగర్. ధూపం రంగస్వామి తదితరులు పాల్గొన్నారు



# అత్తాపూర్‌లో ఫుడ్ ఎస్టాబ్లిష్మెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

## భారీగా ఆహార పదార్థాల స్వాధీనం

గండిపేట(క్రైమ్ మిర్రర్): అత్తాపూర్ ప్రాంతంలో పానీపూరీలు, సమోసాలను భారీ స్థాయిలో తయారు చేసి వివిధ బండ్లకు సరఫరా చేస్తున్న ఓ ఫుడ్ ఎస్టాబ్లిష్మెంట్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. తనిఖీల్లో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేకుండానే ఆహార వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వంటగదిలో తీవ్ర అపరిశుభ్రత, ఈగల బెడద, ఓపెన్ డ్రైనేజీ పక్కనే ఆహార తయారీ, కిచెన్ సమీపంలో చెత్త పేరుకుపోవడం, పెస్ట్ కంట్రోల్ లేకపోవడం వంటి పలు ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు వెలుగుచూశాయి. అలాగే నల్లగా మారిన వాడిన వంటనూనెను తిరిగి వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యానికి హానికరంగా ఉన్న నేపథ్యంలో సుమారు 3 వేల పానీపూరీలు, 4 కిలోల సమోసాలు, 2 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఆహార నాణ్యతను నిర్ధారించేందుకు నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపించారు. అనంతరం ఫుడ్ బిజినెస్ కార్యకలాపాలను నిలిపివేసి సంబంధిత ఫుడ్ ఎస్టాబ్లిష్మెంట్‌ను సీజ్ చేశారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. కనీస ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని ఫుడ్ ఎస్టాబ్లిష్మెంట్లపై తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# డాక్టర్ వృత్తి గొప్పది, బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించొద్దు :ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

## పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట.. వైద్యశాఖ సమీక్షలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా సబ్ సెంటర్లు పీహెచ్సీలు సిహెచ్సిలు ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు, సిబ్బంది, సాంకేతిక పరికరాలు, కావలసిన నిధులకు సంబంధించిన వివరాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా నల్గొండ జిల్లా వైద్యాధికారులను శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశించారు.మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో వైద్యశాఖ సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పై యాదాద్రి భువనగిరి జిల్లా వైద్యాధికారులు నల్గొండ జిల్లా వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సమావేశంలో మునుగోడు, నాంపల్లి, పిహెచ్సిల ఆధునీకరణతోపాటు 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సిహెచ్సి ని 30 పడకల నుండి 50 పడకలకు పెంచడం సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పన పోస్టుమార్టం ఎగ్జామిన్ రూమ్,, చండూరు రెవిన్యూ కేంద్రంలో వంద పడకలతో ఏరియా ఆసుపత్రి మంజురు నిర్మాణం, గట్టుపల్ పిహెచ్సికి సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పన కు కావలసిన అంచనాలు రూపొందించాలన్నారు.జాతీయ రహదారి 65 పై ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ హవర్లో హైదరాబాదు తీసుకెళ్లలేకపోతున్నారని ఈలోపే చాలామంది



మరణిస్తున్నారని.చౌటుప్పల్ ప్రాంతంలో అత్యవసర చికిత్స కోసం ట్రామా కేర్ సెంటర్ ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ట్రామా కేర్ సెంటర్ తో పాటు చౌటుప్పల్లో వంద పడకల ఏరియా ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేసి సాంకేతిక పరికరాల కల్పనతో ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రైవేట్ ఆస్పత్రిలో బిల్లులు కట్టలేక ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉందని గుర్తు చేస్తూ ప్రజా వైద్యం పైన ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.ప్రస్తుతం గ్రామాలలో నిర్మించే ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాల బడ్జెట్ మారుతున్న పరిస్థితులు, పెరుగుతున్న ధరలు, అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సరిపోవడం లేదని సబ్ సెంటర్లతో పాటు పిహెచ్సిలు సిహెచ్సీ లు, ఏరియా ఆసుపత్రుల బడ్జెట్ పెంపు విషయం కూడా ఆరోగ్యశాఖ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు.పీహెచ్సీలలో సిహెచ్సి లలో డాక్టర్లు కమిట్మెంట్తో పని చేయాలని, అన్ని వృత్తుల కంటే డాక్టర్ వృత్తి ఎంతో గొప్పదని బాధ్యత రాహిత్యంగా ప్రవర్తించొద్దన్నారు.ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ జిల్లా డి ఎం హెచ్ ఓ రాహుల్, డి సి హెచ్ మాతృ నాయక్, యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎం హెచ్ ఓ మనోహర్, డి సి హెచ్ సూర్య శ్రీ లతో పాటు మర్రిగూడ చౌటుప్పల్ పిహెచ్సి వైద్యాధికారులు, చండూరు మునుగోడు నాంపల్లి మర్రిగూడ వైద్యాధికారులు, నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు..

# చివరి ప్రయాణంలోనూ తోడుగా నిలిచిన మానవత్వం..

**అనాధకు కుటుంబంగా మారిన ఎండిఆర్ ఫౌండేషన్**

**బంధువులు లేకున్నా.. గౌరవంగా అంతిమయాత్ర చేసిన ఎండిఆర్ ఫౌండేషన్**

**మానవత్వానికి మరో పేరు.. మాద్రి పృథ్వీరాజ్**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, జూలై 30:** పుట్టినప్పుడు ఎవరో చేతుల్లో ఎత్తుకున్నారు... కానీ చివరి ప్రయాణంలో భుజం ఇచ్చే మనిషి కూడా లేకపోవడం ఎంత విషాదమో! అలాంటి ఓ గుర్తుతెలియని అభాగ్యుడి జీవితానికి, మరణానికీ సాక్షిగా నిలిచింది భానూర్ సమీపం. పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో కనిపించిన ఆ మృతదేహానికి కన్నీరు పెట్టుకునే బంధువులు లేరు... పేరు చెప్పే మనుషులు లేరు... కానీ మానవత్వం మాత్రం అతడిని ఒంటరిగా వదల్లేదు. మానవసేవే మాధవసేవ అనే భావంతో ముందుకు సాగుతున్న ఎండిఆర్ ఫౌండేషన్ ఆ గుర్తుతెలియని అనాధ మృతదేహానికి అన్ని మతాచారాలను గౌరవిస్తూ గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించింది. ఈ సేవా కార్యక్రమానికి మాద్రి పృథ్వీరాజ్ ఆర్థిక సహకారం అందించి, “అనాధ అయినా మనిషే... చివరి గౌరవం ప్రతి ఒక్కరికీ దక్కాలి” అనే సందేశాన్ని చేతల్లో చూపించారు. నేటి కాలంలో సొంత బంధాలే దూరమవుతున్న సందర్భాలు కనిపిస్తున్న వేళ, ఎవరికీ చెందని ఓ అనాధకు కుటుంబ సభ్యుల్లా అండగా నిలిచి చివరి వీడ్కోలు పలకడం అక్కడున్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. మరణంలోనూ ఓ మనిషిని ఒంటరిగా వదలకుండా గౌరవప్రదంగా సాగనంపడం నిజమైన మానవత్వమని ఎండిఆర్ ఫౌండేషన్ మరోసారి నిరూపించింది.పటాన్‌చెరు ప్రాంతంలో అనాధల చివరి సంస్కారాలను బాధ్యతగా నిర్వహిస్తూ ఎన్నో కుటుంబాలకు ధైర్యంగా నిలుస్తున్న ఎండిఆర్ ఫౌండేషన్ సేవలను స్థానికులు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు.“జీవితంలో సేవ... చివరి ప్రయాణంలోనూ గౌరవం” అనే లక్ష్యంతో మానవతా సేవలను నిరంతరం కొనసాగిస్తున్న ఎండిఆర్ ఫౌండేషన్, మాద్రి పృథ్వీరాజ్ చేస్తున్న ఈ సేవ సమాజానికి స్ఫూర్తిదాయకమని పలువురు ప్రశంసిస్తున్నారు. మనిషి చనిపోయిన తర్వాత కూడా అతని గౌరవాన్ని కాపాడటం... అదే నిజమైన మానవత్వమని ఈ ఘటన మరోసారి గుర్తు చేసింది.

# హైదర్‌షాకోట్‌లో బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం

**ఉత్సవ కమిటీ ఏర్పాటు..**

**ఆగస్టు 9న బోనాలు, 10న పలహారం బండి ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయం**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** హైదర్‌షాకోట్ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో రానున్న బోనాల మహోత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని ఉత్సవాల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో బోనాల పండుగను సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక బోనాల ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా నర్సింగరావు, వైస్ చైర్మన్‌గా లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పెద్దల సమక్షంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఆగస్టు 9 (ఆదివారం) బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంతో పాటు, ఆగస్టు 10 (సోమవారం) సంప్రదాయ పలహారం బండి ఊరేగింపు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, గ్రామ ప్రజలందరి సహకారంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు ఉత్సవాల్లో చురుకుగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.



# మణికొండ మైసమ్మకుంట శికం భూమిపై అక్రమ ఆర్ఎంసీ ప్లాంట్ ఆరోపణలు

**సమగ్ర విచారణకు డిమాండ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నర్సింగ్ సర్కిల్ పరిధిలోని మణికొండ సర్వే నెం.193లోని మైసమ్మకుంట శికం (చెరువు) భూమిపై దివ్యశ్రీ కన్స్ట్రక్షన్స్ సంస్థ రెడీ మిక్స్ కాంక్రీట్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు వెలువడడంతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం శికం భూమిగా నమోదైన ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించడం చట్టబద్ధమేనా అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. స్థానికుల అభిప్రాయం ప్రకారం శికం భూమిలో ఆర్ఎంసీ ప్లాంట్ నిర్వహణ వల్ల వాయు, శబ్ద, భూగర్భ జలాల కాలుష్యంతో పాటు చెరువు పరిరక్షణకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవేళ ఆ ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటుకు అనుమతులు జారీ చేసి ఉంటే, అవి ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలు మరియు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంయుక్తంగా తక్షణమే స్థల పరిశీలన నిర్వహించి, శికం భూమిపై ఆక్రమణ జరిగిందా, ప్లాంట్ చట్టబద్ధంగా ఏర్పాటు చేయబడిందా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలనలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే,



అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్లాంట్‌ను సీజ్ చేయడంతో పాటు ఆక్రమిత శికం భూమిని పునరుద్ధరించాలని, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల పాత్రపై తెలంగాణ విజిలెన్స్ శాఖ, అవినీతి నిరోధక శాఖ స్వతంత్ర విచారణ చేపట్టాలని కోరుతున్నారు. ప్రజల నీటి వనరులు, చెరువులు మరియు శికం భూముల పరిరక్షణ ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రధాన బాధ్యత అని, ఈ వ్యవహారంలో నిజానిజాలు వెలికితీసి చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రతపై అవగాహన సదస్సు....



మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : ఐటీ కారిడార్ ప్రాంతంలోని హాస్టళ్లలో భద్రత, లా అండ్ ఆర్డర్ పై అవగాహన కల్పించేందుకు అయ్యప్ప సొసైటీ లో ఐటీ కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాదాపూర్ ఎస్‌హెచ్‌ఓ కేవీ సుబ్బారావు, డీఐ పి. రమేష్ తదితర పోలీసు అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ ఎచ్ ఓ కే వి సుబ్బారావు మాట్లాడుతూ హాస్టళ్లలో సీసీటీవీ కెమెరాలు, రిజిస్టర్ నిర్వహణ, సందర్శకుల ఎంట్రీ రికార్డులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. డ్రగ్స్, సైబర్ నేరాలు, అమ్మాయిల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోలీసు–ప్రజల మధ్య సమన్వయం పెంపొందించుకోవాలని అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్ ప్రాంతాలకు చెందిన 100కు పైగా హాస్టల్ యజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డు ఈ కేవైసీ గడువు పొడిగించాలి

**ఆర్టిఐ జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్**



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 30(క్రైమ్ మిర్రర్):** సమాచార హక్కు రక్షణ చట్టం - 2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు దబ్బటి శేఖర్ పత్రిక ప్రకటన మాట్లాడుతూ రేషన్ కార్డ్ ఈ కేవైసీ గడువు జులై 31 తేదీ వరకు ఉండడం వలన కొంతమంది వి ఆధార్ కార్డు బయోమెట్రిక్ అప్డేట్ లేకపోవడం వలన ప్రజలు అయోమయం అవుతున్నారు ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ కావడానికి ఏడు నుంచి పది రోజుల సమయం పడుతుంది కావున రాష్ట్ర ప్రభుత్వం గమనించి రేషన్ కార్డ్ ఈ కేవైసీ గడువు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని దబ్బటి శేఖర్ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాను

# కమిషనర్ మురళీకృష్ణను బదిలీ చేయాలి

**కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు చైర్‌పర్సన్ సంధ్యారాణి, బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు**

**ఒంటెద్దు పోకడలతో పాలన సాగిస్తున్నారని ఆరోపణ**



**మంచిర్యాల జూలై 30: (క్రైమ్ మిర్రర్) :** క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను వెంటనే బదిలీ చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి రాజారమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు చైర్‌పర్సన్, పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు.కమిషనర్ వ్యవహార శైలి వల్ల మున్సిపల్ పాలనకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, ప్రజలు, ప్రజాప్రతినిధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. పాలకవర్గంతో సమన్వయం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.కమిషనర్ తీరుపై చైర్‌పర్సన్, కౌన్సిలర్లు పలు ఆరోపణలు చేశారు. ప్రజలు, చిరు వ్యాపారులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వచ్చాయని తెలిపారు. అలాగే చెక్కులపై సంతకాలు చేయకపోవడంతో కార్మికుల వేతనాలు నిలిచిపోయాయని, దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని మున్సిపల్ అవసరాలకు కాకుండా ఇతర పనులకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్ వైఖరి కారణంగా మున్సిపాలిటీలో పాలన సజావుగా సాగడం లేదని పేర్కొన్నారు.“కమిషనర్ ఒంటెద్దు పోకడల వల్ల క్యాతనపల్లి మున్సిపాలిటీలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుంది” అని చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యారాణి రాజారమేష్ పేర్కొన్నారు.మున్సిపల్ పాలనలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కమిషనర్‌ను వెంటనే బదిలీ చేసి, సమర్థవంతమైన అధికారిని నియమించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయి

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి**

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**



**సంస్థాన్ నారాయణపురం, జూలై 30(క్రైమ్ మిర్రర్):** సమాజంలో పేదలు, కార్మికులు, రైతులపై దోపిడీ, అసమానతలు కొనసాగుతున్నంత కాలం కమ్యూనిస్టుల పోరాటాలు ఎప్పటికీ నిరంతరం కొనసాగుతూనే ఉంటాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. గురువారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిల్లాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సిపిఐ సీనియర్ నాయకులు మేకల రాములు సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇది కమ్యూనిజం యొక్క మూల సిద్ధాంతం, కార్మిక వర్గ విముక్తి కోసం జరిగే చారిత్రక అవసరమన్నారు. చరిత్రలో ఎన్నో రైతాంగ పోరాటాలు, కార్మిక ఉద్యమాలు, పీడిత ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో జరిగాయని, వాటిని ఆదర్శంగా తీసుకుని ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నేటి సమాజంలో ఆర్థిక అసమానతలు మరియు అన్యాయాలు ఉన్నంత వరకు ఈ సైద్ధాంతిక పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఆవశ్యకత ఎన్నడు లేనివిధంగా ఈనాడు దాపురించిందన్నారు. ఉద్యోగ భద్రత లేదు ఔట్సోర్సింగ్ కాంట్రాక్టుల పేరుతో అతి తక్కువ వేతనాలతో శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. భావాలని, ప్రశ్నించేవారిని అణచి వేస్తున్నారని, పైగా రాజ్యాంగాన్ని కాలరాస్తున్నారని అన్నారు. కవులు, కళాకారులను మతోన్మాద అరాచక శక్తులు దాడి చేస్తున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం సోషల్ మీడియాని ఒక ఆయుధం గా మలుచుకొని ద్రోహపూరిత విషజ్వాలలను విర జిమ్ముతుందన్నారు. ప్రపంచంలో బలమైన శక్తి కమ్యూనిజం అన్నారు. కమ్యూనిజం ఇంకెక్కడిది ఉన్నది అనేవారికి జవాబు, ప్రపంచ జనాభా 600 కోట్లలో మూడో వంతు అనగా 108 కోట్ల జనాభా కలిగిన దేశాలలో కమ్యూనిస్టులు అధికారులు ఉన్నారని గుర్తు చేశారు. కమ్యూనిస్టుకు మరణం లేదని కమ్యూనిజానికి అంతం లేదని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పొత్తులు ఉన్నప్పటికీ కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల తరపున ఉద్యమాలకు వెనకాడబోమని తెలిపారు. సిపిఐ ప్రజా ఉద్యమాలు చేపట్టి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని దేశంలో, రాష్ట్రంలో ఉన్న పేదవర్గాల హక్కుల కోసం ప్రజా ఉద్యమాలకు మరింత పదును పెడతామన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం సోషలిస్టు వ్యవస్థ మాత్రమేనని, మనిషి కేంద్రంగా పుట్టిన సిద్ధాంతమే కమ్యూనిస్టు సిద్ధాంతమన్నారు. మనిషి ఉన్నంతకాలం, మనిషిలో ఆలోచనలు, భావాలు, ప్రశ్నలు ఉన్నంత కాలం కమ్యూనిజం ఉంటుందన్నారు. సృష్టి ఉన్నంతకాలం కమ్యూనిజం కొనసాగుతుందని, కమ్యూనిస్టుల విలీనం దేశానికి, దేశ ప్రయోజనాలకు ఒక దిక్సూచి అన్నారు. మేకల రాములు సిపిఐ లో క్రియాశీలక నాయకుడిగా పనిచేసే రాచకొండ ప్రాంతంలో దొరల భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాడని కొనియాడారు. గిరిజన తండాలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పాలకుల దృష్టికి తీసుకు వచ్చి సమస్యలను పరిష్కరించేవాడని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మేకల రాములు. సీపీఐ పార్టీ ఇచ్చిన పోరాట పిలుపుల్లో ముందుండేవాడని అన్నారు. నాటి పాలకులు మేకల రాములుపై మోపిన అక్రమ కేసులకు భయపడకుండా జైల్ జీవితం అనుభవించాడని గుర్తు చేశారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడేవారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో కమ్యూనిస్ట్ కార్యకర్తలు ముందుకెళ్లాలని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి యానాలా దామోదర్ రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు సిపిఐ లో చేరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చునగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్,సర్పంచ్ ముత్యాల ఆంజయ్య, చిలువేరు అంజయ్య,కలకొండ సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి జగన్ , పాండు రంగారావు, ప్రవీణ్ ,పరమేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆగష్టు 22,23,24 తేదీలలో జిఎంపిఎస్ రాష్ట్ర 4వ మహాసభలు విజయవంతం చేయాలి

## యాదాద్రి భువనగిరి జిల్లా గొర్రెల,మేకల పెంపకందార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 30(క్రైమ్ మిర్రర్):** ఆగష్టు 22,23,24 తేదీలలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా చెంగిచెర్లలో జరిగే జిఎంపిఎస్ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా గొర్రెల,మేకల పెంపకందార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దెపురం రాజు పిలుపునిచ్చారు.గురువారం జిఎంపిఎస్ జిల్లా కమిటీ సమావేశం వెటర్నరీ మీటింగ్ హాలులో జరిగింది.ఈ సమావేశంలో పాల్గొన్న మద్దెపురం రాజు మాట్లాడుతూ గొర్రెలు,మేకల పెంపకందారులు తరతరాలుగా వృత్తిని చేసుకుంటూ సమాజానికి బలమైన ఆహారాన్నిస్తూ వీరు మాత్రం సామాజికంగా, ఆర్థికంగా,రాజకీయంగా వెనుకబడి ఉన్నారు.గొర్రెల కాపరులను చైతన్యం చేస్తూ వారి హక్కుల కోసం పోరాడటానికి గత 30 సంవత్సరాలుగా గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం ( జిఎంపిఎస్) పోరాడి అనేక ఫలితాలను సాధించింది.అందులో భాగంగానే యాదాద్రి జిల్లాలో గొర్ల కాపరులను ఐక్యం చేసి రోడ్ల పైన జీవాలను తెప్పించి రాస్తారోకో చేసి భూస్వాములను పెత్తందారులను ఎదిరించి గొర్రెల,మేకలకు ఉచితంగా మేత మేపుకునే విధంగా జీవోను తీసుకొచ్చిందనీ అన్నారు.దొడ్డి కొమరయ్య వారసత్వాన్ని పునికి పుచ్చుకొని నాటి ఉమ్మడి రాష్ట్రంలోనూ నేటి తెలంగాణ రాష్ట్రంలోనూ అనేక ఉద్యమాలు నడుపుతుంది.జీవాలకు మందులు,పశువుల డాక్టర్లను,మేత భూములను,తుమ్మ చెట్లపై హక్కులను, ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి ఎక్స్ గ్రేషియో,సబ్సిడీ రుణాలు సాధించాము.భవిష్యత్తులో అనేక ఉద్యమాలు చేసి సాధించాల్సిన అవసరం ఉంది.దానికోసం గొర్రెల కాపర్లు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేము అధికారంలోకి వచ్చిన 100రోజుల్లో నగదు బదిలీతో గొర్రెల పంపిణీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తి అవుతున్నా అమలు చేయడం లేదు.ఈ ప్రభుత్వం వెంటనే అమలు చేయకపోతే జిఎంపిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ నేపథ్యంలోనే జి.ఎం.పిఎస్ రాష్ట్ర 4వ మహాసభలు ఆగష్టు 22,23,24తేదీలలో చెంగిచెర్లలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ మహాసభలో గొర్రెల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమాలు రూపొందిస్తామని తెలిపారు.ఈ మహాసభలకు గొల్ల,కురుమలు,విద్యావంతులు,మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో జిఎంపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నర్సింహ్మా,ప్రధాన కార్యదర్శి దయ్యాల నర్సిహ్మా, ఉపాధ్యక్షులు బుడుమ శ్రీశైలం,సహాయ కార్యదర్శి కొండె శ్రీశైలం,జోగు శ్రీనివాస్,సోషల్ మీడియా బాధ్యులు క్యాసాని నవీన్,జిల్లా కమిటీ సభ్యులు నారి వెంకటేష్,బీమనబోయిన బాలరాజు,బుగ్గ చంద్రమౌళి ,గునమోని అయిలయ్య,పాక జహంగీర్,యెల్లంల వెంకటేష్,దేవునూరి బాలయ్య,గజ్జి పాండు, రామ్మల్లయ్య పాల్గొన్నారు.

## గంగమ్మ టెంపులో బోనాల పండుగ సాంగ్ షూటింగ్ ప్రారంభం

**మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**



**వనపర్తి జులై 30 క్రైమ్ మిర్రర్ :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీశ్రీ గంగమ్మ దేవాలయం మరియు శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయాల్లో నేటి లీడర్ మ్యూజిక్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న బోనాల పండుగ ప్రత్యేక సాంగ్ షూటింగ్‌ను మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రూపొందుతున్న ఈ బోనాల జాతర సాంగ్ పెబ్బేరు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, హెచ్ఎంటీవీ జర్నలిస్ట్, గొడుగు.బాలవర్ధన్ సాహిత్యం అందించగా, కొరియోగ్రాఫర్ మాస్టర్ నవీన్ ఆధ్వర్యంలో చిత్రీకరణను వైభవంగా నిర్వహించారు.షూటింగ్ సందర్భంగా మహిళలు బోనం కుండలను తలపై మోసుకుంటూ, చిన్నారులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని సందడి చేశారు. డప్పు, జమ్మిడిక వాయిద్యాల నడుమ తెలంగాణ జానపద కళారూపాలను ఆవిష్కరిస్తూ చిత్రీకరణ అద్భుతంగా సాగింది.ఈ సందర్భంగా పలువురు స్థానిక ప్రజలు, భక్తులు చిత్రీకరణను ఆసక్తిగా వీక్షించారు. త్వరలో ఈ బోనాల జానపద గీతాన్ని నేటి లీడర్ మ్యూజిక్ ఛానల్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆరమైసమ్మ ఆలయ జంక్షన్, బండ్లగూడ ఎక్స్ రోడ్స్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతిపత్రం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, రహదారి దాటే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఆరమైసమ్మ ఆలయ జంక్షన్, బండ్లగూడ ఎక్స్ రోడ్స్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ గారికి వినతిపత్రం అందజేశారు. ఈ రెండు ప్రధాన కూడళ్లలో ప్రతిరోజూ వేలాది మంది పాదచారులు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు రహదారి దాటాల్సి వస్తోందని, వేగంగా వెళ్తున్న వాహనాల కారణంగా ప్రమాదాల ముప్పు అధికంగా ఉందని వారు వివరించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన చర్యలు ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానికులు ఈ ప్రతిపాదన అమలులోకి వస్తే ప్రమాదాలు తగ్గడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణ కూడా మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఎల్‌బీ నగర్ పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష



క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్, జూలై 30: ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగా రెడ్డి జిల్లా ఎల్‌బీ నగర్‌లోని అత్యాచారాలు, పోక్సో చట్టం కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఎల్బీనగర్ పోలీసుల వివరాల ప్రకారం, ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 1387/2021గా భారతీయ శిక్షాస్మృతి (IPC) సెక్షన్లు 376(2)(అ), 343, 366, 506తో పాటు పోక్సో చట్టం సెక్షన్ 5(l) చదవబడిన సెక్షన్ 6 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు ఎస్.సి. నెం. 384/2022గా విచారణకు రాగా, న్యాయస్థానం నిందితుడు మెత్రి రవి (28), తండ్రి విఠల్, వృత్తి సెంటరింగ్ కార్మికుడు, వల్లేపూర్ గ్రామం, సంత్‌పూర్ మండలం, జగిత్యాల జిల్లా నివాసిని దోషిగా నిర్ధారించింది. నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.16 వేల జరిమానా విధించింది. అలాగే బాధితురాలికి బాధితుల పరిహార పథకం కింద రూ.1 లక్షల పరిహారం మంజూరు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఎల్‌బీ నగర్ పోలీసులు పకడ్బందీగా సాక్ష్యాధారాలను న్యాయస్థానం ముందు సమర్పించడంతో నిందితుడికి శిక్ష పడినట్లు పోలీసులు తెలిపారు.

## రూ.3 లక్షలు ఇవ్వాల్సిందే.. లేదంటే దుష్ప్రచారమే!

**రియల్ ఎస్టేట్ వ్యాపారిని బెదిరించిన ముగ్గురు విలేకరులపై కేసు**



**మంచిర్యాల జులై 30 (క్రైమ్ మిర్రర్):** రియల్ ఎస్టేట్ సంస్థపై పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో నిరాధార వార్తలతో దుష్ప్రచారం చేస్తూ, డబ్బుల కోసం బెదిరింపులకు దిగిన ముగ్గురు విలేకరులపై మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై కుమ్మరి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మంచిర్యాల గోపాల్‌వాడకు చెందిన గుర్రాల శ్రీధర్ 'అంజనీపుత్ర ఎస్టేట్స్' పేరిట రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజులుగా 'తెలుగు ప్రభ' విలేకరులు అనీష్, గొర్లపల్లి సురేష్‌తో పాటు 'అగ్నిధార' పత్రిక విలేకరి రవి కుమార్ ఆయన సంస్థపై పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ఈ విషయమై బాధితుడు వారిని ప్రశ్నించగా.. రూ.3 లక్షలు ఇస్తేనే వార్తలు నిలిపివేస్తామని, లేకపోతే సంస్థ ప్రతిష్ఠను భంగపరుస్తూనే ఉంటామని బెదిరించారు.బాధితుడు భయపడి జూన్ 29న అనీష్‌కు రూ.50,000 అందజేశారు. అయినప్పటికీ సురేష్, రవి కుమార్‌లు మిగిలిన డబ్బుల కోసం వేధింపులు కొనసాగించారు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో 'అగ్నిధార' పత్రికలో మళ్లీ దుష్ప్రచారం చేశారు. బాధితుడు శ్రీధర్ ఇచ్చునా ఫిర్యాదు మేరకు బుధవారం ముగ్గురు విలేకరులపై బి.ఎన్.ఎస్ సెక్షన్లు 308(2), 3(5)) చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## 84 కేసుల నేరచరిత్ర ఉన్న దొంగ అరెస్ట్

**రూ.21 లక్షల విలువైన వాహనాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం**



సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 30: అంతర్‌జిల్లా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సంగారెడ్డి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.21 లక్షల విలువైన రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, ఒక ఆక్టివా స్కూటీ, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.డీఎస్పీ సత్యయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీల సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, సంగారెడ్డి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లాల్లో పలు చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ల చోరీ, బేగంపేటలో బంగారం, వెండి ఆభరణాల చోరీ చేసినట్లు కూడా వెల్లడైంది. ప్రధాన నిందితుడు మునితాని అమర్ రాజ్ కుమార్ రెడ్డి అలియాస్ డాల్ఫై గతంలో 84 కేసులు, మరో నిందితుడు అచ్చిగారి సాయికిరణ్ అలియాస్ ఈశ్వర్రెై 5 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతోంది.కేసును సమర్థవంతంగా ఛేదించిన సంగారెడ్డి రూరల్ పోలీసు అధికారులను అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ అభినందించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్-100కు తెలియజేయాలని సూచించారు.

# మానవ అక్రమ రవాణా నిరోధనకు సమాజం, పోలీసుల సమిష్టి కృషి అవసరం- డాక్టర్ సునీత కృష్ణన్.





గండిపేట్ (క్రైమ్ మిర్రర్): ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బి.వి.ఆర్.ఆర్. తెలంగాణ పోలీస్ అకాడమీలో మానవ అక్రమ రవాణా, సురక్షిత వలస అంశంపై ప్రజ్వల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ డా.సునీతా కృష్ణన్ అవగాహన సదస్సులో ప్రసంగించారు. డా. సునీతా కృష్ణన్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న సంఘటిత నేరమని, లైంగిక దోపిడి, బాల కార్మికత్వం, బలవంతపు భిక్షాటనం, అవయవాల అక్రమ రవాణా, సైబర్ మోసాలు, నకిలీ విదేశీ ఉద్యోగాల పేరుతో జరిగే అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఆన్‌లైన్ గ్రూమింగ్, సిఎస్ఎఎం వంటి సైబర్ ముప్పులను వివరించి, బాధితుల రక్షణ, పునరావాసం, సమర్థవంతమైన దర్యాప్తు కోసం నివారణ, రక్షణ, విచారణ మరియు శిక్ష, భాగస్వామ్యం (4పిం) సూత్రాలను సమిష్టిగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ పోలీసు యూనిఫామ్‌పై ప్రజలకు అపార విశ్వాసం ఉందని, ప్రతి పోలీసు అధికారి ఆ విశ్వాసాన్ని నిజాయితీ, వృత్తి నైపుణ్యం, మానవీయ దృక్పథంతో నిలబెట్టాలని అన్నారు. మానవ అక్రమ రవాణాను ఆధునిక బానిసత్వంగా అభివర్ణిస్తూ, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించడం, సమన్వయంతో పనిచేయడం, సోషల్ మీడియా వినియోగంలో బాధ్యతతో పాటు వ్యక్తిగత గోప్యతను కాపాడుకోవడం అత్యంత అవసరమని సూచించారు. ఈ సందర్భంగా సునీత కృష్ణన్ ను అకాడమీ డైరెక్టర్ జ్ఞాపిక తో సన్మానించారు. ఈ కార్యక్రమం లో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి కవిత, అసిస్టెంట్ డైరెక్టర్ వేమా శ్రీనివాసరెడ్డి ఇతర అధికారులు ప్రొబేషనరీ డిఎస్పి లు,ఇతర ట్రైనీ అధికారులు పాల్గొన్నారు.జ

# వినాయక చవితి, నిమజ్జనోత్సవాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలి - రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**గణేష్ నిమజ్జనోత్సవాలపై కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జోనల్ స్థాయి సమావేశం**



**గండిపేట్ (క్రైమ్ మిర్రర్):** సెప్టెంబర్ 14న ప్రారంభమయ్యే వినాయక చవితి మొదలుకొని సెప్టెంబర్ 25వ తేదీ అనంత చతుర్దశి రోజు వరకు జరిగే వినాయక నిమజ్జనోత్సవాల కు అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే, రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు టి ప్రకాష్ గౌడ్ అదికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం కిస్మత్ పూర్ లోని రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన గణేష్ నిమజ్జనోత్సవాలపై జరిగిన సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వినాయక నిమజ్జనం ఊరేగింపు జరిగే అన్ని రహదారులను బాగు చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపు జరిగే ప్రాంతాలలో అడ్డంగా కరెంటు వైర్లు, చెట్లు ఉంటే వాటిని సరి చేసే విధంగా విద్యుత్, జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన లో వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కృషితో హనుమాన్ నగర్ పత్తికుంట ( వినాయక సాగర్ ) లో రాబోయే రోజుల్లో అందంగా తీర్చిదిద్దడానికి, వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడానికి కావలసిన అన్ని ఏర్పాట్లు జరుగుతాయన్నారు. మండపాల నిర్వాహకులు శాంతియుత వాతావరణంలో ఇతరులకు ఇబ్బందులు కలకుండా ఊరేగింపు చేయాలన్నారు. పత్తి కుంట, పల్లె చెరువు వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజేంద్రనగర్, అత్తాపూర్, కిస్మత్ పూర్ , బండ్లగూడ, చాంద్రాయణగుట్ట, పాతబస్తీలోని ప్రాంతాలన్నిటిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అందుకోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు. బాలాపూర్ గణేష్ నిమజ్జన ర్యాలీ రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని పాతబస్తీ రోడ్ల గూండా వెళ్తున్న నేపథ్యంలో ఆ రహదారులను కూడా బాగు చేయడానికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినాయక మండపాల నిర్వాహకులు అధికారులకు సహకరించి శాంతియుత ంగా నిమజ్జనోత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఈ సంవత్సరం మీరాలం చెరువు వద్ద పనులు జరుగుతున్నందువల్ల అక్కడ నిమజ్జనాలు ఉండవన్నారు.

మండపాల నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలి–రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్... వినాయక మండపాలు నిర్వాహకులు అనుమతులు తీసుకోవాలని, అలా చేసినట్లయితే బందోబస్తుకు ఇబ్బందులు ఉండవన్నారు. వినాయక చవితి, నవరాత్రులు, నిమజ్జోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండపాల వద్ద అనుమానితులు ఎవరైనా కనిపిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.అనుమతుల పేరిట ఇబ్బందులు పెట్టవద్దు–శశిధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి...అనుమతుల పేరిట మండపాల నిర్వాహకులను ఇబ్బందులు పెట్టవద్దని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ అన్నారు . అనుమతులు అనే దాని బదులు ఇంటిమేషన్ ఇస్తే చాలు అని అంటే బాగుంటుందన్నారు. గణేష్ నిమజ్జోత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం అన్ని శాఖల అధికారులపై ఉందన్నారు. కిస్మత్ పూర్, పీరం చెరువు ప్రాంతాలలో నిమజ్జన పాయింట్లను పెట్టి అన్ని సౌకర్యాలు కల్పించాలి–మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్... కిస్మత్ పూర్ , పీరం చెరువు ప్రాంతాలలో నీటి సౌకర్యం ఉన్నచోట నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేసి క్రేన్ , విద్యుత్, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బి మహేందర్ గౌడ్, గోకరి సురేష్ గౌడ్ లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

**హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను వన్ వే గా పోనివ్వాలి-వై శ్రీధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్...**

హిమాయత్ సాగర్ నుంచి వచ్చే వాహనాలను కుడివైపు రోడ్డు గుండా వన్వే లో వెళ్ళేటట్లు చూడాలన్నాని భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ వై శ్రీధర్ కోరారు. పత్తికుంట వైపు ఉన్న రోడ్డులో కేవలం వినాయక నిమజ్జనోత్సవాల వాహనాలకే ఉపయోగించేలా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలు జరిగే ప్రాంతాలలో ముందుగానే ఏర్పాట్లు చేయాలన్నారు.

**కరెంటు తీగెలను సరి చేయాలి-ఎం ప్రభాకర్ రెడ్డి, శివరాంపల్లి...**

శివరాంపల్లి పెద్ద వినాయకుడు ఊరేగింపుగా నిమజ్జనానికి వెళ్లడం జరుగుతుందని, కరెంటు తీగలను విద్యుత్ అధికారులు సరిచేయాలని ఆ బస్తీకి చెందిన ఎం ప్రభాకర్ రెడ్డి కోరారు . గత సంవత్సరం విద్యుత్ వైర్లు తగడం తగలడం వల్ల చాలా ఇబ్బందులు కలగాయన్నారు. గడచిన 18 సంవత్సరాలుగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ నాయకత్వంలో వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయని రాజేంద్రనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఇంద్ర పాల్ రెడ్డి అన్నారు. ఈ సంవత్సరం కూడా అధికారులు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు ఆలె భాస్కర్ రాజ్ , కార్యదర్శి కె మహేందర్, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ మల్లారెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్, రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, రాజేంద్రనగర్ జోనల్ ఎస్ ఈ నరేందర్ గౌడ్, రాజేంద్రనగర్ విద్యుత్ డీఈ రత్నాకర్ రావు, రాజేంద్రనగర్ , అత్తాపూర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు బి సురేందర్ రెడ్డి, మల్లారెడ్డి, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ జోహార్ అలీ, జీహెచ్ ఎంసీ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన సత్యనారాయణ రెడ్డి, నాయకులు ఎన్ ధనుంజయ, జోగి రవి తదితరులు పాల్గొన్నారు.



# శంకర్‌పల్లిలో నిబంధనలకు పాతర

**రోడ్డుపైకి దూసుకొస్తున్న అక్రమ నిర్మాణాలు -- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు**



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలో భవన నిర్మాణ నిబంధనల ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సంగారెడ్డి ప్రధాన రహదారి వెంట నిర్మాణాలు చేపడుతున్న కొందరు భవన యజమానులు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వదలాల్సిన సెట్‌బ్యాక్‌ను పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కొందరు వ్యాపారులు, భవన యజమానులు రోడ్డుపైకి రేకులు, షెడ్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే రద్దీగా ఉండే సంగారెడ్డి రహదారి మరింత ఇరుకుగా మారి, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**

పట్టణ నడిబొడ్డున ఇలాంటి ఉల్లంఘనలు జరుగుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ విభాగం తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, దీంతో నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారికి ప్రోత్సాహం లభిస్తోందని విమర్శిస్తున్నారు.

**ప్రమాదకరంగా మారిన రాకపోకలు**

రోడ్డుపైకి విస్తరించిన నిర్మాణాల కారణంగా కాలినడకన వెళ్లే ప్రజలు, భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఉన్నతాధికారులు స్పందించాలని విజ్ఞప్తి**

సంగారెడ్డి రహదారిపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేపట్టి, సెట్‌బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రోడ్డును ఆక్రమించి నిర్మించిన షెడ్లు, రేకులు, ఇతర అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నూతన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితేందర్ మెరుగుకు ఘన సన్మానం

**127, 128 డివిజన్ల కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధుల శుభాకాంక్షలు**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నెక్నంపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన జితేందర్ మెరుగు ని మణికొండ 127, 128 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి జితేందర్ మెరుగు సమర్థవంతంగా కృషి చేసి, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిరణ్ కుమార్, యాలాల నరేష్, అహ్మద్ షా ఖాన్, ముత్యాలు, మల్లేష్, సావిత్రి, ఇందిరా రెడ్డి, షేక్ హాజీ, కస్తూరి సతీష్, ఏ. రాజు, మహేష్ రెడ్డి, మహేష్ బాబు, పృథ్వీరాజ్, భాస్కర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కుమార్, ఇమ్రాన్, రవికాంత్, నరేందర్ తదితరులు పాల్గొని జితేందర్ మెరుగు కి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నూతన అధ్యక్షుడికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

**మిర్యాలగూడలో లీలా హాస్పిటల్స్ ప్రారంభం..**

**సేవాభావంతో ప్రజల మన్ననలు పొందాలని ప్రజాప్రతినిధుల సూచన**




మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 30: ప్రజలకు నాణ్యమైన, అందుబాటు వైద్య సేవలు అందించి వారి విశ్వాసాన్ని పొందాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీలు కేతావత్ శంకర్ నాయక్, ఎంసీ కోటిరెడ్డి పేర్కొన్నారు.మిర్యాలగూడ పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన లీలా హాస్పిటల్స్‌ను గురువారం వారు ప్రారంభించారు. ఆస్పత్రి యాజమాన్యం డాక్టర్ ఎల్.ఎన్.వి. రాజేష్ రెడ్డి, బొబ్బలి వెంకట్రాంరెడ్డి, మందడి సైదిరెడ్డి, జూకూరి చైతన్యరాజు, డాక్టర్ కె. సుధాకర్, ధనావత్ రంగ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు మెరుగైన చికిత్స అందించాలని, సేవాభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు.కార్యక్రమంలో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, గుడిపాటి నవీన్, గాయం ఉపేందర్ రెడ్డి, దుబ్బాక నర్సింహారెడ్డి, కౌన్సిలర్ ఫారూఖ్ మొహమ్మద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కోడిరెక్క ఇంద్రకుమార్, మోయిజ్, వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, మేడ మహేందర్ రెడ్డి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఇలియాస్ ఖాన్, ఎండీ యూసుఫ్, మోసిన్ అలీ, టీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షోయబ్, హాతిరామ్ నాయక్, చిట్టిబాబు నాయక్, గయాస్, మాజీ సర్పంచ్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.